

సవాళ్లు ఎదురవుతాయి, మీరు అన్నీ సరిగ్గా చేసినా కూడా ప్రజలు మిమ్మల్ని నిందించవచ్చు. కలత చెందకండి, వాటికి అతీతంగా ఎదగండి. సాధారణం గా మహిళలు ఎక్కువ భావోద్వే గ స్వభావం కలిగి ఉంటారు, అం దుకే వారు త్వరగా ఒత్తిడికి లోన వుతారు. కాబట్టి, వారు తమను తాము మానసికంగా దృఢంగా ఉంచుకోవాలి. వారు సంగీతం వి నాలి; వ్యాయామం, యోగా మరి యు ధ్యానం కోసం కొంత సమ యం కేటాయించాలి. అదే దీనికి పరిష్కారం.సమయ ఒత్తిడి అనే ది లింగం, వయస్సు లేదా సామా జిక వర్గంతో సంబంధం లేకుండా అందరికీ ఉంటుంది. సమయ ఒ త్తిడి అనేది కేవలం ఒక మానసిక విషయం మాత్రమే. మనస్సు దృఢంగా, ఆరోగ్యంగా మరియు శక్తివంతంగా ఉన్నప్పుడు, సహ జంగానే ఉత్సాహం కలుగుతుం ది, అప్పుడు ప్రతి పనికీ సమ యం దొరుకుతుంది! మనస్సు చురుకుగా ఉంటే, చాలా చిన్నవి గా అనిపించే పనులకు కూడా మీరు సమయాన్ని కేటాయించగ లరు."నాకు సమయం లేదు" అ నేది మనస్సులో కలిగే ఒక భ్రమ మాత్రమే. మీరు ప్రతి పనికీ సమ యాన్ని సృష్టించుకోవచ్చు. "నా కు సమయం లేదు" అని మీరు అనవచ్చు, కానీ దానివల్ల నిరా శకు లేదా అసహనానికి గురికా వద్దు! నేనూ అప్పుడప్పుడు "దీ నిని పరిశీలించడానికి నాకు సమ యం లేదు, మీరే చూడండి" అని అంటుంటాను.కానీ ఆ "నాకు సమయం లేదు" అనే మాట చెప్పేటప్పుడు మీలో అంతర్గత అసహనం ఉండకూడదు. అర్థమైందా? "నాకు సమయం లేదు" అనే మాటను వాడకూ డదని నేను చెప్పడం లేదు. మీరు అలా అనవచ్చు. కానీ దానిని మీకు ఒత్తిడి కలిగించే అంశంగా మార్చుకోవద్దు.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ


www.prajadeevena.com

# ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 341 | సోమవారం | 12 అక్టోబర్ 2026 | పేజీలు : 04 వెల ₹5


# అత్యున్నత న్యాయస్థానం అసహనం

ట్రాఫిక్, మెట్రోపై ఇష్టారాజ్యంగా ఆంక్షలు చెల్లవు.. అత్యవసరమైతేనే బారికేడ్లు

ఇంటర్నెట్‌కు అంతరాయం కలిగించవద్దు.. పౌరుల ప్రాథమిక హక్కులను

కాపాడటం మా బాధ్యత.. లాయర్లు, జర్నలిస్టులకు అడ్డంకులు కలిగించొద్దు

మెట్రోస్టేషన్ల మూసివేత కోర్టు ధిక్కరణే.. దీనిపై అఫిడవిట్ వేయండి: సుప్రీం

నిరసనకారుల పట్ల పోలీసులు విచక్షణా రహితంగా వ్యవహరించారు

ధర్మాసనానికి విన్నవించిన పలువురు న్యాయవాదులు

45 స్టేషన్లే మూసివేశాం.. ఇంటర్నెట్‌ను పునరుద్ధరించాం: సొలిసిటర్ జనరల్



ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పౌరులు, ప్రతిపక్ష నాయకులతోపాటు న్యాయవాదులపైనా పోలీసులు అణచివేత ధోరణి ప్రదర్శించడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. నిరసనకారులను చట్టవిరుద్ధంగా నిర్బంధించడం గానీ, ప్రజా రవాణాను ఇష్టారాజ్యంగా నిలిపివేయడం గానీ చేయకూడదని తేల్చిచెప్పింది.

## సీఈసి రాజీనామాకు సీజేపీ పట్టుదల

మోదీ ప్రధానిగా ఉండడం దేశానికి అవమానకరం

సీజేపీ నేతలు దీప్కే, సౌరవ్‌దాస్, రాంకా, షిండే

సీఈసీ రాజీనామా చేసేదాకా ఉద్యమం ఆగదని వెల్లడి

06








# ఇవ్వాలా ఇండి కూటమి వంతు

## 'చలో ఢిల్లీ - ప్రజాస్వామ్యం కోసం మార్చ్' పేరిట

కనాట్‌ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వరకు భారీ ర్యాలీ

భారీగా తరలిరావాలని శ్రేణులకు కాంగ్రెస్ పిలుపు

వివిధ రాష్ట్రాల నుంచి ఢిల్లీ వెళుతున్న కూటమి నేతలు

సీజేఐని కలిసి వినతిపత్రం ఇస్తామన్న ఖర్గే, రాహుల్

కలిసేందుకు అనుమతివ్వని జస్టిస్ సూర్యకాంత్

యువత స్వరం మరింతగా ప్రతిధ్వనిస్తుంది: రాహుల్

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది: ఖర్గే

ఢిల్లీలో భారీగా మోహరించిన భద్రతా బలగాలు

వివరాలు 4లో

దేశ రాజధాని ఢిల్లీలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా, 'సర్' ప్రక్రియ నిలిపివేత, బ్యాలెట్ పేపర్లతో ఎన్నికల నిర్వహణ డిమాండ్లతో ఇండి కూటమి సోమవారం భారీ ర్యాలీకి సిద్ధమైంది. 'చలో ఢిల్లీ - ప్రజాస్వామ్యం కోసం మార్చ్' పేరిట ఢిల్లీలోని కనాట్‌ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లి.. చీఫ్ జస్టిసకు వినతిపత్రం అందజేస్తామని ఇండి కూటమి నేతలు ప్రకటించారు.

# అప్పటివరకు మానవాళి అంతరించే ప్రమాదం

2100 నాటికి మానవాళి అంతరించే ప్రమాదం

హెచ్చరించిన లాన్సెట్ కథనం

02

కృత్రిమ మేధస్సు (ఏఐ) దుర్వినియోగం, అణు యుద్ధాలు, జీవాయుధాలతో భవిష్యత్తులో మానవాళికి మహా ముప్పు పొంచి ఉందని ప్రముఖ వైద్య జర్నల్ 'లాన్సెట్'లో ప్రచురితమైన తాజా నివేదిక హెచ్చరించింది.



# భాజపా పాలనలో బాధల్లో యువత

గోవాను డ్రగ్స్ స్టోర్‌గా మార్చిన బీజేపీ

ఆ పార్టీని మళ్లీ నమ్మి మోసపోవద్దు

రావణుడిని ఓడించేందుకు

రాముడికి మద్దతుగా నిలబడండి

గోవా ప్రజలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

గోవా ముఖ్యమంత్రిని ప్రాపర్టీ సావంత్ అంటూ ఎద్దేవా

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** భారత రాజకీయాల్లో బీజేపీని రావణాసురునిగా, కాంగ్రెస్ పార్టీని శ్రీరామునిగా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. రావణుడిని ఓడించేందుకు రామునికి మద్దతుగా నిలబడాలని గోవా ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీని నమ్మి గోవా ప్రజలు రెండు సార్లు మోసపోయారని, మరోసారి మోసపోవద్దని సూచన చేశారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను ప్రాపర్టీ సావంత్ అంటూ ఎద్దేవా చేశారు. గోవా భూములు, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును

మిగతా 2 లో





# వికసిత్ భారత్‌లో విద్యార్థులు భాగస్వామ్యవ్వండి

సవాళ్లకు పరిష్కారాలు మీ చేతుల్లోనే

ఇదే సరైన సమయం.. అవకాశాల్ని అందుకోండి

దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

రెండవ అతిపెద్ద మొబైల్ తయారీ కేంద్రంగా భారత్..

చెన్నైలో విద్యార్థులతో ప్రధాని మోడీ

వివరాలు 4లో

ప్రపంచం ఎదుర్కొంటున్న కొత్త సవాళ్లకు పరిష్కారాలను కనుగొనే దిశగా అడుగులు వేస్తోందని, వాటిని అందించే సామర్థ్యం, ప్రతిభ భారత యువతకు ఉన్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేయడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన నొక్కి చెప్పారు.

# సిద్దిపేట సిగలో శాశ్వతంగా నిలుస్తాం

వరాల వరద కేసీఆర్.. కరువు దరువు కాంగ్రెస్

నదుల్లో నీళ్లున్నా ఎత్తిపోయలేని అసమర్థ ప్రభుత్వమిది

కొత్తవి వద్దు, ఉన్నవి రద్దు.. ఇదే కాంగ్రెస్ పాలన తీరు

జిల్లాల పునర్విభజనతో ప్రగతి ముద్ర వేసిండు కేసీఆర్

సిద్దిపేట జిల్లా సభలో మాజీ మంత్రి హరీశ్

03



# భాజపా పాలనలో బాధల్లో యువత

మొదటి పేజీ తరువాయి

కాపాడుకోవడమే లక్ష్యంగా ఆ రాష్ట్ర కాంగ్రెస్ విభాగం సెప్టెంబరు 22 నుంచి నిర్వహిస్తున్న గోయ్ రఖోన్స్ యాత్రలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. చీఫెన్స్ స్మారకం నుంచి కున్కోలిమ్ బస్టాండ్ వరకు సాగిన యాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఢిల్లీలో నిరసన కార్యక్రమాల నేపథ్యంలో రాహుల్ గాంధీ గోవాకు రాలేకపోయారని, దాంతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనను రాహుల్ గాంధీ ప్రతినిధిగా తనను పంపారని రేవంత్ రెడ్డి చెప్పారు. రాహుల్‌గాంధీ దేశ ప్రజలను ఏకం చేయడానికి ప్రయత్నిస్తుంటే.. ప్రధాని మోదీ ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఆరోపించారు. ఇప్పటికే గోవాలో రెండు సార్లు బీజేపీని గెలిపించి మోసపోయిన ప్రజలు.. ఆ పార్టీ పాలనతో విసిగి పోయారన్నారు. ఇక్కడ మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే.. గోవా ప్రజలు పరాయివారిగా మారిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గోవా భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్ కాదు.. ప్రాపర్టీ సావంత్ అని ప్రజలు చెప్పుకుంటున్నారన్నారు. ప్రమోద్ సావంత్ గోవాను అభివృద్ధి చేయకుండా ప్రజల ఆస్తులను ఇతరులకు అప్పగించే పనిలో ఉన్నారని ఆరోపించారు.

గోవాలో నిరుద్యోగిత తీవ్రంగా ఉందన్నారు. ఈ ఒత్తిడిని తట్టుకోలేక నిరుద్యోగ యువకులు కొందరు డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో గోవా.. ఒక డ్రగ్స్ స్టోర్‌గా మారిందన్నారు. 2023కు ముందు హైదరాబాద్ కూడా డ్రగ్స్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొందని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేకంగా ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రగ్స్‌లో కొంత భాగం గోవా నుంచి వస్తున్నట్లు గుర్తించి, ప్రత్యేక బృందాన్ని పంపగా పెద్ద ఎత్తున స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈ క్రమంలో పలువురు నైజీరియన్లనూ అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నషా ముక్త్ భారత్ అని మాట్లాడుతున్న ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. ఆ పనిని గోవాలో ఎందుకు అమలు చేయట్లేదని నిలదీశారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌కు పోలీసులతో పాటు ఈడీ, సీబీఐ, ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థల మద్దతు ఉన్నప్పటికీ డ్రగ్స్ సమస్యను ఎందుకు నియంత్రించలేకపోతున్నారని నిలదీశారు.



“ గోవాను డ్రగ్స్ పెడ్లర్స్ అడ్డాగా మార్చారు. ఇది గోవాకు కీర్తిని తెచ్చి పెడుతుందా.. లేక పేరు చెడగొడుతుందా?” అని ప్రశ్నించారు. గోవా యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దు.. గోవా పేరు చెడిపోవద్దన్నదే తమ ఆకాంక్ష అని చెప్పారు. గోవాలో కాంగ్రెస్ పార్టీకి కాకుండా ఏ పార్టీకి ఓటు వేసినా అది బీజేపీకే చేరుతుందన్నారు. గోవాలో డ్రగ్స్ లార్డ్స్.. ల్యాండ్ మాఫియా రాజ్యమేలాలా.? కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలా ? అన్నది ఇక్కడి ప్రజలు ఆలోచన చేయాలన్నారు. గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం... కాంగ్రెస్ పార్టీ కోసం కాదని, ప్రజల కోసం రావాల్సిన అవసరం ఉందన్నారు. గోవా ఎన్నికల్లో ప్రజలు హస్తం గుర్తుకు మాత్రమే ఓటు వేసి గెలిపించాలన్నారు. చిన్నపార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు ఓటు వేస్తే అది బీజేపీకే లాభం చేకూరుస్తుందన్నారు. ప్రతిపక్ష ఓట్లను చీల్చేందుకే చిన్న పార్టీలను బీజేపీ ప్రోత్సహిస్తోందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. బీజేపీకి ఐటీ, సీబీఐ, ఈడీ తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థలు ముందుండి పని చేస్తాయని.. ఇప్పుడు వాటితో కూడా ఆ పార్టీకి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అందుకే జ్ఞానేశ్ కుమారు పేరుతో ప్రధాని మోదీ ఓట్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సీఈసీ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో నైరుతీ రుతుపవనాలు ముందుగా కేరళ, ఆ తర్వాత గోవాలోకి ప్రవేశిస్తున్నాయని చెప్పారు. అలాగే 2026లో కేరళంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, 2027లో గోవాలో ఏర్పాటు కాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గోవా నుంచి నేరుగా ఢిల్లీ ఎర్రకోటపై మూడు రంగుల జెండా ఎగరడం ఖాయమన్నారు.



# వికసిత్ భారత్‌లో విద్యార్థులు భాగస్వామ్యవ్వండి

## చెన్నైలో విద్యార్థులతో ప్రధాని మోడీ

**చెన్నై:** ప్రపంచం ఎదుర్కొంటున్న కొత్త సవాళ్లకు పరిష్కారా లను కనుగొనే దిశగా అడుగులు వేస్తోందని, వాటిని అందించే సామర్థ్యం, ప్రతిభ భారత యువతకు ఉన్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేయడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. యువతకు భారతదేశం అపారమైన అవకాశాలను కల్పిస్తోం దని పేర్కొన్న ఆయన.. తమ సామర్థ్యాన్ని గుర్తించి దేశాబివృద్ధిలో బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత రూపొందించే వినూత్న ఆలోచనలు, పరిష్కారాలు కేవలం భారతదేశ భవిష్యత్తి కాకుండా ప్రపంచ భవిష్యత్తు కూడా తీర్చిదిద్దుతాయని ఆయన స్పష్టం చేశారు. సమష్టి కృషితో దేశ ఆశయాలను సాకారం చేసుకోవచ్చని ప్రధాని దీమా వ్యక్తం చేశారు. ఆదివారం చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయం స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రధాని మోడీ ప్రసంగిం చారు. భారతదేశ తయారీ రంగ వృద్ధిని ప్ర స్తావిస్తూ, ఈ రంగ విస్తరణ యువ తకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశా లను కల్పించిం దని అన్నారు. భారత దేశ రక్షణ రంగ ఎగుమతులు 50 రెట్లు పెరిగా యని, అలాగే ఇంజనీ రింగ్ ఎగుమతులు కూడా సరికొత్త రికా ర్డును నెలకొల్పాయని పేర్కొన్నారు. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద మొబైల్ ఫోన్ తయారీ దేశంగా భారత్ అవతరించిందని ప్రధాని తెలిపారు. 2014 నుంచి ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11 రెట్లు పెరిగాయని ఆయన వెల్లడించారు.

### రూ.13వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు

ఐఐటీ–మద్రాస్లో జరిగిన ఒక కార్యక్రమంలో, తమిళనాడు. వ్యాప్తంగా రూ.13,000 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు.. వాటికి శంకుస్థాపన చేస్తారు. వీటిలో దాదాపు రూ.3,700 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులు, చెన్నై ఓడరేవు, కామరాజర్ ఓడరేవు – వీట చిదంబరనార్ ఓడరేవుల లో చేపట్టే కార్యక్రమాలు, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే స్టేషన్ల అభివృద్ధి వంటివి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ కూడా పాల్గొన్నారు.

### విజయ్ కలిసి మెట్రో రైలు ప్రారంభం

దాదాపు రూ.4,900 కోట్ల వ్యయంతో నిర్మించిన చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్ట్ రెండవ దశలోని పూనమల్లి–వడపళని మార్గాన్ని నరేంద్ర మోడీ ప్రారంభించారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ తో కలిసి సంయుక్తంగా కొత్త మెట్రో సేవలను జెండా ఊపి ప్రారంబించి కొద్ది దూరం మెట్రో రైలులో ప్రయాణించారు. కొత్తగా ప్రారంభించిన ఈ మార్గంలో 15 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 11 ఎలివే టెడ్ మెట్రో స్టేషన్లు ఉన్నాయి.

# హస్తినకు రాష్ట్ర కాంగ్రెస్

**నేడు ఇండీ కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన**

**గోవా నుంచి ప్రత్యేక విమానంలో రేవంత్**

**హైదరాబాద్ నుంచి టీపీసీసీ చీఫ్ సహా 60 మందికి పైగా ప్రజా ప్రతినిధులు**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ‘సర్’కు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో సోమవారం జరగనున్న భారీ నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సహా కాంగ్రెస్ తెలంగాణ ప్రజా ప్రతినిధులు, నేతలు ఆదివారం రాత్రే ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. గోవా రాజధాని పనాజీలో ఆ రాష్ట్ర కాంగ్రెస్ నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్న సీఎం రేవంత్.. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లిపోయారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు తదితర 60 మందికి పైగా నాయకులు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో వెళ్లారు. ఇండీ కూటమి తలపెట్టిన నిరసనలో పాల్గొనేందుకు ఢిల్లీకి రావాలంటూ మంత్రులు, పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలను ఏఐసీసీ ఆదేశించిన నేపథ్యంలో అంతా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

# డ్రగ్స్ పెడ్లర్ల ఆర్థిక మూలాలపై ఈగల్ నజర్

**గోవాకుచెందిన పెడ్లర్ క్రిస్టీ అరెస్టు..**

**అతని ఖాతాకు పలువురి నుంచి రూ.48.4 లక్షలు**

**అతని ఫోన్‌లో తెలంగాణకు చెందిన 25 మంది నంబర్లు.. విచారిస్తున్న ఈగల్**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తరలిస్తున్న ముఠాలపై కొన్నాళ్లుగా దృష్టి పెట్టిన ఈగల్ బృందాలు తాజాగా ప్రధాన పెడ్లర్ ఫెర్నాండెజ్ అలియాస్ క్రిస్టీని అరెస్టు చేశాయి. గోవాకు చెందిన క్రిస్టీ కోసం ఈగల్ అధికారులు చాలాకాలంగా వెతుకుతున్నారు. అతను గోవాలోని కాలంగుట్, అగర్‌వాడ్డో, బార్జెజ్ ప్రాంతం నుంచి డ్రగ్స్ దందా సాగిస్తున్నాడని గుర్తించారు. అలాగే గోవా నుంచి డ్రగ్స్ పంపిస్తున్న వారికి డబ్బు ఎలా చేరుతోందనే విషయంపై దృష్టి సారించి.. క్రిస్టీ ఆర్థిక నెట్‌వర్క్‌పై నిఘా పెట్టారు. అరెస్టు చేసిన తర్వాత అతని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా.. కొద్ది కాలంలోనే రూ.48.4 లక్షలు వివిధ వ్యక్తుల నుంచి వచ్చినట్లు గుర్తించారు. తెలంగాణకు చెందిన 25 మంది వ్యక్తులు క్రిస్టీ ద్వారా డ్రగ్స్ కొన్నట్లు ఆన్‌లైన్ చెల్లింపులను బట్టి అనుమానిస్తున్నారు. ఈ మేరకు క్రిస్టీ మొబైల్ ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లు, పేర్లను విచారిస్తున్నామని ఈగల్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మే 9న పంజాగుట్ట పోలీసులు కేశవ్‌రాజ్ సింగ్ అనే వ్యక్తిని డ్రగ్స్ విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతని కారు డాష్‌బోర్డు నుంచి 13 గ్రాముల ఎండీఎంఏ, 7 గ్రాముల చరస్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసు విచారణలో మారేడ్‌పల్లికి చెందిన వేదాంక్, గోవాకు చెందిన క్రిస్టీల వద్ద నుంచి కేశవ్ డ్రగ్స్ కొని హైదరాబాద్‌లో విక్రయిస్తున్న విషయం బయటపడింది. గోవాలో ఉంటూ డ్రగ్స్ దందా చేస్తున్న నైజీరియన్ నిగికి క్రిస్టీకి మధ్య సంబంధాలు ఉన్నట్లు ఈగల్ అధికారులు అనుమానిస్తున్నారు.

### క్రిస్టీ ఫోన్‌లో ఉన్న పేర్లు

తెలంగాణకు చెందిన 25మంది క్రిస్టీతో కాంటాక్ట్ అయ్యారన్న విషయాన్ని ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా గుర్తించిన పోలీసులు ఆ వివరాలను మీడియాకు అందజేశారు. రాష్ట్రంలో నివసిస్తున్న తరుణ్, అవ్యక్త్ రెడ్డి, శ్రీరామ్, విక్రాంతు, రిచు, గోకుల్, విష్ణు, సూద్, చేతన్, అరవింద్, హమీద్, సునీల్, అజయ్‌వర్మ, సలీత్, పరాజిత్, వినీత్, అర్జున్, ఈశ్వర్, శరణ్, కరణ్, ప్రీతమ్, తేజ్‌దీప్, రవీందర్, మనోజ్, అదీపల పేర్లు క్రిస్టీ కాంటాక్ట్ లిస్టులో ఉన్నాయని పేర్కొన్నారు. కేవలం పేరు, నంబరు ఉండటంతోనే వారు డ్రగ్స్ తీసుకున్నారని నిర్ధారించలేమని, ఒక వేళ నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు ఉంటాయని ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు.

# రిలయన్స్‌పై మస్క్ దాడి కంటిన్యూ

**సగటు భారత పౌరుడికి ప్రయోజనం**

**అంబానీ మద్దతుదారుల వాదన అర్థరహితం**

**రిలయన్స్‌పై కొనసాగుతున్న మస్క్ దాడి**

**న్యూఢిల్లీ :** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని లక్ష్యంగా చేసుకొని ‘స్పేస్‌ఎక్స్’ అధినేత ఎలాన్ మాస్క్ తన దాడిని కొనసాగిస్తున్నారు. తన శాటిలైట్ ప్రొవైడర్ రాకతో భారత్‌లో పోటీ పెరిగి సగటు పౌరుడు ప్రయోజనం పొందుతాడని ఆదివారం ‘ఎక్స్’లో ఆయన పేర్కొన్నారు. అంబానీ మద్దతుదారులు హాస్యాస్పద కపటత్వం, అతిశయోక్తులతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తమ ఆగమనం అంబానీ లాభాలను తగ్గించవచ్చుని, కానీ ఆయన వ్యాపారానికి తాము ఎలాంటి ముప్పు కలిగించబోదన్నారు. స్టార్‌లింక్ సేవలు మరీ ఖరీదైనవిగా అనిపిస్తే ప్రజలే సబ్‌స్క్రైబ్ చేసుకోరని.. దాంతో స్పేస్‌ఎక్స్ కూడా సరసమైన ధరలకు సేవలందించక తప్పదని తెలిపారు. అంబానీ మద్దతుదారుల వాదనలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని కొట్టిపారేశారు. ‘ఓపక్క భారత్‌లో అంబానీ గుత్తాధిపత్య సామ్రాజ్యం అందించే అత్యంత తక్కువ ధరలతో స్టార్‌లింక్ ఏమాత్రం పోటీపడలేదని వారే అంటారు. మళ్లీ వారే స్టార్‌లింక్ చాలా బలమైన పోటీదారు అని చెబుతారు’ అని మస్క్ వ్యాఖ్యానించారు. భారత టెలికాం రంగంలో రిలయన్స్ ప్రధాన పాత్ర పోషిస్తుండడంతో.. స్టార్‌లింక్ రాకుండా అంబానీ అడ్డుకుంటున్నారని మస్క్ వారం రోజులుగా ఆరోపణలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే.

### స్టార్‌లింక్‌తో భారత భద్రతకు ముప్పు: దూబే

భారత కమ్యూనికేషన్ల రంగంలోకి స్టార్‌లింక్ ప్రవేశం దేశ భద్రతకు ముప్పుగా పరిణమిస్తుందని కమ్యూనికేషన్లు, ఐటీ రంగంపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ చైర్మన్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే స్పష్టంచేశారు. ఎలాన్ మాస్క్ తీరుపై దూబే మండిపడ్డారు. భారత్ ప్రజాస్వామ్య, సార్వభౌమ దేశమని.. సోషల్ మీడియా, ఒత్తిళ్లతో తన భద్రతా విధానాన్ని మార్చుకోదని ఆదివారం ‘ఎక్స్’లో స్పష్టం చేశారు. స్టార్‌లింక్‌తో వల్ల పొంచి ఉన్న ప్రమాదాలపై తమ కమిటీ అధ్యయనం చేసిందన్నారు.

# నేపాల్‌ను ముంచిన ఆకస్మిక వరదలు

**కాఠ్మాండు :** హిమాలయ దేశం నేపాల్ మళ్లీ ఆకస్మిక వరదలతో వణికిపోయింది. గూర్ఖా జిల్లాలో బుధి గండకి నదిలో ఆదివారం ఉదయం ఒక్కసారిగా వరద పోటెత్తటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కొండలపైకి పరుగులు తీశారు. బురదతో నిండిన భారీ వరద ప్రవాహానికి సిల్లేరి, పైయూకా, జగత్ గ్రామాల్లో 35 ఇళ్లు కొట్టుకుపోయాయి. చుమ్నుబ్రి–6 మున్సిపాలిటీలో ఒక తీగల వంతెన తెగిపోయింది. ఒక జలవిద్యుత్ కేంద్రం తీవ్రంగా దెబ్బ తిన్నది. ఈ ఆకస్మిక వరద బీభత్సానికి 10 మంది గల్లంతయ్యారు. 50 మందిని నేపాల్ సైన్యం కాపాడింది. గత ఆగస్టులో మాదిరిగానే ఆదివారం కూడా ఎలాంటి వర్షాలు లేకుండానే ఆకస్మిక వరదలు సంభవించాయి. టిబెట్ సరిహద్దు నుంచి దక్షిణ దిశగా ప్రవహించి త్రిశూలీ నదిలో కలిసే బుధి గండకి నదిలో ఉదయం 6.30 గంటలకు వరద ప్రవాహ ఉధృతి మొదలైంది. ఆ సమయంలో నదిలో 3.66 మీటర్ల లోతు ప్రవాహమే ఉంది. ఉదయం 8.40 గంటలక ప్రవాహం 8.43 మీటర్ల ఎత్తుకు చేరింది. నది ఎగువ ప్రాంతంలో కృత్రిమంగా ఏర్పడిన జలాశయం తెగటం వల్లే ఈ వరదలు సంభవించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

# పెళ్లైన విషయం దాచి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి

**మహిళపై తొమ్మిదేళ్లుగా లైంగిక దాడి..**

**డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి అరెస్టు**

**రిమాండ్‌కు తరలించిన సైదాబాద్ పోలీసులు**

**నేడో రేపో సస్పెండ్ చేసే అవకాశం**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** తనకు పెళ్లైన విషయాన్ని దాచి, భర్త చనిపోయి ఒంటరిగా ఉంటున్న మరో మహిళతో పరిచయం పెంచుకున్న ఓ సీఐ.. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి తొమ్మిదేళ్లుగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పెళ్లి ప్రస్తావన తెచ్చిన ప్రతిసారీ ఏదో ఒక సాకుతో దాటవేస్తుండటంతో విసిగిపోయిన ఆ మహిళ పోలీసులను ఆశ్రయించింది. దాంతో రంగంలోకి దిగిన పోలీసులు ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నిందితుడు బాలస్వామిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ జిల్లాకు చెందిన బాధిత మహిళకు 2008లో సాయికుమార్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. ఆమెకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగం రావడంతో వారు 2009లో హైదరాబాద్‌కు వచ్చి సైదాబాద్‌లో నివాసముంటున్నారు. ఈ క్రమంలో 2015లో సాయికుమార్ ఓ ప్రమాదానికి గురై వెన్నుముక విరిగి మంచానికే పరిమితమయ్యాడు. విధుల్లో భాగంగా ఓ పని నిమిత్తం 2016 డిసెంబర్‌లో సదరు మహిళ చంద్రాయణగుట్ట పోలసస్టేషన్‌కు వెళ్లింది. ఆ సమయంలో అక్కడ అడ్మిన్ ఎస్సైగా ఉన్న బాలస్వామి.. ఆ మహిళతో పరిచయం పెంచుకున్నాడు. తర్వాత ఆమెకు తరుచూ ఫోన్‌చేసి మాట్లాడటం ప్రారంభించాడు. తాను అవివాహితుడనని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అప్పుడు మంచాన పడ్డ తన భర్త గురించి బాధితురాలు చెప్పింది. ఆయన ఎక్కువ రోజులు బతకడని వైద్యులు చెప్పిన నేపథ్యంలో ఆమె కూడా అతడిని పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకొంది. తనకు దివ్యాంగురాలైన సోదరితో పాటు.. కొన్ని వ్యక్తిగత సమస్యలు ఉన్నాయని త్వరలోనే వాటిని పరిష్కరించుకొని పెళ్లిచేసుకుంటానని ఎస్సై బాలస్వామి షరతు పెట్టడంతో బాధిత మహిళ అందుకు అంగీకరించింది. ఈ క్రమంలో ఇద్దరు శారీరకంగా దగ్గరయ్యారు. బాలస్వామికి గతంలోనే పెళ్లైనట్లు బాధితురాలికి తెలిసి అతడిని నీలదీయగా.. తన భార్యతో తీవ్రమైన గొడవలు జరుగుతున్నాయని, విడిపోయి విడిగా ఉంటున్నామని, త్వరలోనే విడాకులు తీసుకుంటామని నమ్మబలికాడు. అయినా బాధితురాలు అతన్ని దూరం పెట్టడంతో ఆవేదనకు గురైన బాలస్వామి.. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటానని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి మళ్లీ దగ్గరయ్యాడు. 2021లో బాధితురాలి భర్త మరణించడంతో ఆమెతో సహజీవనం కొనసాగించాడు. ఆ తర్వాత 2025 జనవరి నుంచి తనను క్రమంగా దూరం పెట్టడంతో తీవ్ర అనారోగ్యానికి గురైన బాధితురాలు.. సైదాబాద్ పోలీసులను ఆశ్రయించింది.



ఇన్నేళ్లు తనను శారీరకంగా వాడుకుని మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బాలస్వామిని అదుపులోకి తీసుకున్నారు. డీఐ బాలస్వామి గతమంతా వివాదాస్పదమేనని శాఖలోచర్చించుకుంటున్నారు. ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ వచ్చిన తర్వాత ఆయన భవానీనగర్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. అక్కడ మరో మహిళతో వివాదం జరగ్గా, ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దాంతో అతడిని ఎస్‌హెచ్‌వో నుంచి తప్పించి ఖైరతాబాద్ డీఐగా బదిలీ వేటు వేశారు. ఇక్కడికి వచ్చిన 8 నెలల్లోనే తాజా వివాదం వెలుగులోకి వచ్చింది. బాలస్వామిని నేడో, రేపో సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# సిద్దిపేట సిగలో శాశ్వతంగా నిలుస్తాం

**వరాల వరద కేసీఆర్.. కరువు దరువు కాంగ్రెస్**

**నదుల్లో నీళ్లున్నా ఎత్తిపోయలేని అసమర్థ ప్రభుత్వమిది**

**కొత్తవి వద్దు, ఉన్నవి రద్దు.. ఇదే కాంగ్రెస్ పాలన తీరు**

**జిల్లాల పునర్విభజనతో ప్రగతి ముద్ర వేసిండు కేసీఆర్**

**సిద్దిపేట జిల్లా దశాబ్ది ఉత్సవాల ముగింపు సభలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్**



**ప్రజా దీవెన, సిద్దిపేట** : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి వల్లే రాష్ట్రం ప్రగతి పథాన పయనించిందని, సిద్దిపేట జిల్లా అభివృద్ధికి కేసీఆర్ వేసిన పునాదే కారణమని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పష్టంచేశారు. చరిత్రలో ఒకసారి ఏర్పడే జిల్లా హోదా, ఒకసారి వచ్చే రైలుమార్గం, సాగునీటి ప్రాజెక్టుల వంటి విజయాలు సిద్దిపేట అభివృద్ధిలో శాశ్వతంగా నిలిచిపోతాయని, ఈ విజయాల వెనుక కేసీఆర్ కృషి ఎంతగానో ఉన్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, రైతులు, యువత, విద్యార్థులు, పేదల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టంచేశారు. సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేండ్లు పూర్తయిన సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన మూడు రోజుల దశాబ్ది ఉత్సవాల ముగింపు మహాసభకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి హరీశ్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో హరీశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ వచ్చిన తర్వాత అభివృద్ధి పనులకు బ్రేకులు వేసి, ప్రాజెక్టులను రద్దు చేయడం, రైతులను కష్టాల్లోకి నెట్టడం తప్ప చేసిందేమీ లేదని మండిపడ్డారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, విద్యుత్తు ఉత్పత్తి చేయలేక, సాగునీటి ప్రాజెక్టుల మోటర్లు నడుపలేక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ కరువని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో ఐదేండ్లలోనే అనేక ప్రాజెక్టులు పూర్తిచేశారని, కాలువలు నిండుగా ప్రవహించడం, భూగర్భజలం పెరిగి, సాగుకు 24 గంట ల విద్యుత్తు అందడంతో వ్యవసాయ రంగ ము ఖచిత్రం మారిందని గుర్తుచేశారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా తలకిందులైందని, కరెంటు కోతలతో మోటర్లు కాలిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.

### 6 గంటల కరెంటుతో కష్టాలు

కేసీఆర్ హయాంలో 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తు అందేదని, ప్రస్తుతం ఆరు నుంచి ఎనిమిది గంటల సరఫరాతోనే సరిపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని హరీశ్ వాపోయారు. పాత రోజులు తెస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి నిజంగానే నాటి రోజులను తెచ్చాడని దెప్పిపొడిచారు. మళ్లీ ఆరు గంటల కరెంటు, కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, ఎండిపోయే పంటలు కనిపిస్తున్నాయని చెప్పారు. యాదాద్రి, భద్రాద్రి, కొత్తగూడెం, సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో ఉత్పత్తి సజావుగా సాగేందుకు అవసరమైన బొగ్గు నిల్వలను సమయానికి సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బొగ్గు సరఫరాలో జాప్యం వెనుక అవినీతి, బంధుప్రీతి ఉన్నాయని ఆరోపించారు.

### నీళ్లున్నా ఎత్తలే

గోదావరి, కృష్ణా నదుల్లో నీటి లభ్యత ఉన్నా సాగునీటి ప్రాజెక్టుల మోటర్లను నడుపకపోవడం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతున్నదని హరీశ్ ఆవేదన వ్యక్తంచేశారు. తాను ప్రశ్నించిన తర్వాత రంగనాయకసాగర్‌లో కొంతమేర నీటిని నింపారని, అయినా పూర్తిస్థాయి వినియోగంపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు మోటర్లను 24 గంటలు నడపాల్సిన చోట పరిమిత సమయం మాత్రమే నడుపుతున్నారని తెలిపారు. దేవాదుల నుంచి నీరు అందితే చేర్యాల, మద్దూరు, ధూళ్మిట్ట, కొమురవెల్లి ప్రాంతాల్లోని రైతులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నిండటంతో పాటు ఆ ప్రాంతాల్లో పంటలు పండే అవకాశం ఉంటుందని పేరొన్నారు. నీరు అందుబాటులో ఉన్నా ప్రభుత్వం ఎత్తిపోయకపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

### పాలమూరు రైతులకు అన్యాయం

తాను పాలమూరు బిడ్డనని చెప్పుకొనే రేవంత్‌రెడ్డి అదే ప్రాంత రైతులను సాగునీటి కష్టాల్లోకి నెట్టారని హరీశ్ విమర్శించారు. శ్రీశైలంలో నీటి లభ్యత ఉన్నా కల్వకుర్తి ప్రాజెక్టు మోటర్లను గతంలో మాదిరిగా నిరంతరంగా నడుపడం లేదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని తరలించే ప్రయత్నాలు చేస్తుండగా, తెలంగాణలోని పాలమూరు ప్రాంత రైతులకు మాత్రం రేవంత్ పూర్తిస్థాయి నీటిని అందించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కుప్పం వంటి దూరప్రాంతాలకు నీటిని తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు, కృష్ణా నది సమీపంలోని పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎందుకు ఎదురవుతున్నాయని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కల్వకుర్తి, దేవాదుల, కన్నెపల్లి పంప్‌హౌస్ మోటర్లు సాగునీటి అవసరాలకు అనుగుణంగా పనిచేశాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో రెండు పంటలు పండేలా సాగునీటి వ్యవస్థను అభివృద్ధి చేసిన గత ప్రభుత్వ విధానాలకు భిన్నంగా, ప్రస్తుత ప్రభుత్వం రైతులను పంటలు వేయొద్దని కోరే పరిస్థితి తెచ్చిందని విమర్శించారు. హుస్నాబాద్ ప్రాంతానికి కీలకమైన గౌరవెల్లి ప్రాజెక్టు పనులు గత ప్రభుత్వ హయాంలో దాదాపు 98 శాతం పూర్తయ్యాయని, మిగిలిన కొద్దిపాటి పనులను పూర్తి చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దుబ్బాక నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల పరిధిలో 30 గ్రామాలకు సాగునీరు అందించే ఇరిగేషన్ లిఫ్ట్ పనులను కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు.

### 33 జిల్లాలు.. 33 మెడికల్ కాలేజీలు

తెలంగాణలో 33 జిల్లాలను ఏర్పాటు చేసిన కేసీఆర్ ప్రభుత్వం, ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసిందని హరీశ్ గుర్తుచేశారు. సిద్దిపేటకు జిల్లా హోదా లేకపోతే ఇకడ మెడికల్ కాలేజీ ఏర్పాటయ్యేదా? అని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీతో పాటు నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, జిల్లా స్థాయి ప్రభు త్వ కార్యాలయాలు, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేం జ్ వంటి సదు-పాయాలు ప్రజలకు అందుబాటులోకి రావడానికి జిల్లా ఏర్పాటే దోహదపడిందని చెప్పారు. ఐటీ రంగంలో సిద్దిపేట యువతకు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కోరగా, ఐటీ టవర్ నిర్మించారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత సిద్దిపేట ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని విమర్శించారు. వెటర్నరీ కళాశాల సగం పూర్తయిన తర్వాత దాన్ని కొడంగల్‌కు తరలించారని, బాలికల కోసం మంజూరైన ఎస్సీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల భవనాన్ని రద్దు చేశారని చెప్పారు.

### కేసీఆర్ ఫ్యాక్టరీ కట్టించిండు .. రిబ్బన్ కటింగ్ రేవంత్

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కేసీఆర్ కట్టించారని, గత ప్రభుత్వం చేసిన పనులకు రేవంత్‌రెడ్డి రిబ్బన్ కటింగ్ చేయడం తప్ప చేసిందేం లేదని దెప్పిపొడిచారు. మార్చి 22న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం సందర్భంగా రైతుబంధు నిధులను 45 రోజుల్లో విడుదల చేస్తామని సీఎం రేవంత్ ప్రకటించారని, అక్టోబర్ 11 నాటికి 200 రోజులు గడిచినా జమ కాలేదని విమర్శించారు. సిద్దిపేట ప్రజలు తనపై చూపిన ప్రేమాభిమానాలను మర్చిపోలేనని, తన చివరిశ్వాస వరకు ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తానని స్పష్టంచేశారు. జిల్లా సాధనకు కృషిచేసిన సేవలను స్మరించుకోవడం, పదేండ్ల ప్రగతిని గుర్తుచేసుకోవడం వేడుకల ఉద్దేశమని తెలిపారు. మహాసభలో దుబ్బా క ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, సిద్దిపేట తొలి జడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, ఎర్రోళ్ల శ్రీనివాస్, బకి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌బాబు పాల్గొన్నారు.

### జెన్ జీలతో హరీశ్ ముఖాముఖి

సిద్దిపేట అక్టోబర్ 11 : 'కేసీఆర్ ఫైటర్, విజనరీ ఉన్న నాయకుడు.. మీ గొంతుకనై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తం.. ఇచ్చిన హామీల అమలు కోసం ప్రతిపక్షంగా ప్రశ్నిస్తం' అని హరీశ్ స్పష్టంచేశారు. సిద్దిపేట జిల్లా దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా పట్టణంలోని కోమటిచెరువు నెక్లెస్ రోడ్డు వద్ద జెన్ జీలతో ఆయన ముఖాముఖి సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో 1.60 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. యువత గంజాయి, ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడుతున్నారని, బెట్టింగ్‌లు పెట్టి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. యువత డ్రగ్స్, బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. 'కేసీఆర్ విజనరీ లీడర్, పోరాట యోధుడు.. ఒకప్పుడు బెంగాల్ ఏం చేస్తే దేశం అదే ఆచరిస్తది అనే నానుడి ఉండేది.. కానీ, కేసీఆర్ సీఎం అయ్యాక తెలంగాణ ఏం చేస్తే దేశం అదే ఆచరిస్తది అనే పరిస్థితి వచ్చింది. అందుకే ఆయన గొప్ప దూరదృష్టి కలిగిన నాయకుడు' అని హరీశ్ కొనియాడారు.

## సిరిసిల్ల ఇంజనీరింగ్ కాలేజీ సమస్యలు పరిష్కరించండి: కేటీఆర్

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2021లో రూ.402 కోట్ల పరిపాలనా అనుమతితో మంజూరైన భవన నిర్మాణం ఇప్పటికీ పెండింగ్‌లో ఉందన్నారు.కాగా, కొడంగల్ అగ్రికల్చరల్ కాలేజీలో బీఎస్సీ సీటు సాధించిన ములుగు జిల్లా తాడ్వాయి మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని శ్రుతికి కేటీఆర్ రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే తమ కుటుంబానికి చదువు భారంగా మారిందని, సాయం చేయాలని ఎక్స్ వేదికగా శ్రుతి చేసిన విజ్ఞప్తిపై కేటీఆర్ స్పందించారు. ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ ద్వారా ఆర్థిక సాయం పంపడమే కాకుండా.. విద్యార్థినితో ఫోన్లో మాట్లాడారు/.

# నీ అంతు చూస్తా..?

**నా కళాశాల ఆహ్వానాన్నే తిరస్కరించే ధైర్యం వచ్చిందా?**

**జేఎన్‌టీయూ వీసీకి వీజేఐటీ కళాశాల యజమాని పల్లా రాజేశ్వర్‌రెడ్డి బెదిరింపులు**

**కేపీహెచ్‌బీ పోలీసులకు వీసీ భార్య ఫిర్యాదు**

**అంతకుముందే వీసీపై ఫిర్యాదు చేసిన వీజేఐటీ ప్రిన్సిపాల్**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌యూటీ) వైస్ ఛాన్సలర్, వీజేఐటీ ప్రిన్సిపాల్ మధ్య వివాదం కొత్త మలుపు తీసుకుంది. వీజేఐటీ సంస్థల అధినేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌కాల్ చేసి తమను బెదిరించారని జేఎన్‌యూటీ వీసీ భార్య సృజన కిషన్‌రెడ్డి కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తమ కళాశాలలో నిర్వహిస్తున్న అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) కార్యక్రమానికి రావాలని వీజేఐటీ ప్రిన్సిపాల్ సృజన, హెచ్‌వోడీ అరుణకుమారి తదితరులు ఈనెల 6న జేఎన్‌టీయూ వీసీ కిషన్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. గతంలో తాను వీజేఐటీలో పనిచేసినప్పుడు యాజమాన్యం (పల్లా రాజేశ్వరరెడ్డి) తనను చాలా అవమానించిందని, ఈవెంట్ వచ్చే ప్రసక్తే లేదని వీసీ తేల్చి చెప్పారు. అయినప్పటికీ తమ ఆహ్వానాన్ని మన్నించి రావాలని మహిళా ప్రొఫెసర్లు కోరారు. అందుకు ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఇన్విటేషన్‌ను చించి చెత్తబుట్టలో పడేశారు. దాంతో ప్రిన్సిపాల్ సృజన జరిగిన విషయాన్ని పల్లా రాజేశ్వరరెడ్డికి ఫోన్‌లో వివరించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. రెండు రోజుల తర్వాత జేఎన్‌టీయూ వీసీ కిషన్‌రెడ్డిపై ప్రిన్సిపాల్ సృజన కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళా ఉద్యోగులని కూడా చూడకుండా అభ్యంతరకరంగా మాట్లాడి అవమానించారని, మహిళలు ఉద్యోగాలు చేయడానికి పనికిరారని కించపరిచే వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు జేఎన్‌టీయూ వీసీ



కిషన్‌రెడ్డి భార్య సృజన కిషన్‌రెడ్డి సైతం 9వ తేదీన కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించారు. ప్రిన్సిపాల్ సృజన జేఎన్‌టీయూకు వచ్చి తన భర్త వీసీ కిషన్‌రెడ్డిని ఎడబ్ల్యూఎస్ కార్యక్రమానికి ఆహ్వానించగా, అందుకు ఆయన రాలేనని సున్నితంగా తిరస్కరించారని తెలిపారు. దీంతో వీజేఐటీ సంస్థల అధినేత పల్లా రాజేశ్వరరెడ్డి తమకు వాట్సాప్ కాల్ చేసి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. "నా కళాశాల ఆహ్వానాన్నే తిరస్కరించే ధైర్యం వచ్చిందా? మీ అంతు చూస్తా"అని భయపెట్టారని వీసీ భార్య సృజన కిషన్‌రెడ్డి తెలిపారు.. తిరుపతి ఏయిర్ పోర్టులో ఉన్నామని, కొద్దిసేపటి తర్వాత మాట్లాడతామని చెప్పినా వినకుండా.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. పల్లా రాజేశ్వరరెడ్డి కాల్ రికార్డులను, స్ర్కీన్ షాట్‌లను పోలీసులకు అందజేశారు. రెండు ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ విజయ్ తెలిపారు.

# అప్పటివరకు మానవాళి అంతరించే ప్రమాదం

**2100 నాటికి మానవాళి అంతరించే ప్రమాదం**

**హెచ్చరించిన లాన్సెట్ కథనం**




**ప్రజా దీవెన, న్యూఢిల్లీ :** కృత్రిమ మేధస్సు (ఏఐ) దుర్వినియోగం, అణు యుద్ధాలు, జీవాయుధాలతో భవిష్యత్తులో మానవాళికి మహా ముప్పు పొంచి ఉందని ప్రముఖ వైద్య జర్నల్ 'లాన్సెట్'లో ప్రచురితమైన తాజా నివేదిక హెచ్చరించింది. 2100 నాటికి మానవాళిని తుడిచిపెట్టేసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. వచ్చే 75 ఏళ్లలో మానవాళి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపించే ఇలాంటి 17 ప్రధాన ముప్పులను ప్రస్తావించింది. త్వరలో జర్మనీలోని బెర్లిన్‌లో జరిగే ప్రపంచ ఆరోగ్య సదస్సులో దీనిపై చర్చించనున్నారు. జీవాయుధాలను సృష్టించడానికి ఏఐని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని.. లక్షలాది మంది ప్రాణాలను ప్రమాదంలో పడేయొచ్చని నివేదిక హెచ్చరించింది. అణ్వస్త్ర యుద్ధంతో భారీస్థాయిలో హానికారక ధూళి కణాలు వాతావరణంలోని పైపొరల్లోకి చేరి సూర్యరశ్మిని అడ్డుకుంటాయని.. ఆహారోత్పత్తిని ప్రభావితం చేస్తాయని తెలిపింది. దీనివల్ల ఆహార కొరత ఏర్పడి మానవాళి మనుగడకు ముప్పుగా మారొచ్చని వివరించింది. అలాగే వాయు కాలుష్యం, వాతావరణ మార్పులు, యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (సూక్ష్మజీవులు మందులకు లొంగకపోవడం), ప్రకృతి విపత్తులు సవాళ్లుగా పేర్కొంది. ఒకదానితో ఒకటి ముడిపడిన ఈ సమస్యలను సమగ్రంగా ఎదుర్కోవాలని సూచించింది. ఇవి వాస్తవ రూపం దాల్చితే మానవాళికి మహాముప్పుగా మారొచ్చని లాన్సెట్ ఎడిటోరియల్ కథనం సైతం హెచ్చరించింది. భూతాపాన్ని కూడా పెద్దముప్పుగా పేర్కొంది. ఉష్ణోగ్రతలు పెరుగుతూ పోతే మానవ ఆరోగ్యంపై తీవ్రప్రభావం పడుతుందని అంచనా వేసింది. భూతాపాన్ని 4.4 డిగ్రీల సెల్సియస్ వరకు పెరగకుండా, 1.8 డిగ్రీలకే పరిమితం చేయాలని.. దీనివల్ల 189 కోట్ల ఆరోగ్యకర సంవత్సరాలను కాపాడుకోవచ్చని సూచించింది.

# ఐదేళ్ల బాలిక దారుణ హత్య

**ఉద్యోగం నుంచి తొలగించారన్న కక్షతో మాజీ సెక్యూరిటీ గార్డు దారుణం**

**చిన్నారి చేతులు కాళ్లు కట్టేసి, నడుముకు రాయిని కట్టి సంపులో పడేసి హత్య**

**అర్ధరాత్రి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్**

**నిందితుడు బిహార్ వాసి విక్రమ్‌గా గుర్తింపు**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** సెక్యూరిటీ గార్డు ఉద్యోగం నుంచి తొలగించారన్న కక్షతో ఓ యు-వకుడు ఐదేళ్ల చిన్నారిని పాశవికంగా హత్య చేశాడు. అందరూ బతుకమ్మ వేడుకల్లో ఉండగా ఆ గేటెడ్ కమ్యూనిటీలోకి ప్రవేశించిన ఆ దుర్మార్గుడు.. చిన్నారి కాళ్లు చేతులు కట్టేసి.. మెడకు ఉరి బిగించి.. నడుముకు రాయి కట్టి.. అదే ఆవరణలోని నీటి సంపులో పడేసి వెళ్లిపోయాడు. సాయంత్రం ఈ దారుణానికి ఒడిగట్టిన రాక్షసుడు.. అర్ధరాత్రి దాటాక ఫోన్ చేసి.. ఆ పాపను తానే కిడ్నాప్ చేశానని, విడిచిపెట్టాలంటే రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. చివరకు తెల్లవారుజామున చిన్నారి మృతదేహాన్ని సంపులో గుర్తించారు. హైదరాబాద్‌లోని బొల్లారంలో ఈ దారుణం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బిహార్ నుంచి బతుకుతెరువు కోసం వచ్చిన విక్రమ్ అనే యువకుడికి గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్.. సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఇచ్చింది. అతను నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నందుకు అసోసియేషన్‌లోని అరుళ్‌దాస్ అనే పెద్దాయన మందలించారు. అయినా పద్ధతి మారకపోవడంతో అసోసియేషన్ సభ్యులు అతన్ని తొలగించారు. తన ఉద్యోగం పోవడానికి అరుళ్‌దాసే కారణమని కక్ష పెంచుకున్న విక్రమ్.. ఆయన మనుమరాలిని హత్య చేశాడు. భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన అరుళ్‌దాస్ సింగరేణిలో పనిచేసి రిటైరయ్యారు. ఆయన కుమారుడు మిల్టన్ ఫెర్నాండెజ్, కోడలు డేజీ ఇవాంజిల్, వారి కుమారుడు జెడెన్ ఫెర్నాండెజ్, కుమార్తె అరేలియా మోసెటస(5)తో కలిసి కౌకూరులోని విల్లాస్ ఆర్కిడ్స్‌లో ప్లాట్ నం.84లో 2019 నుంచి ఉంటున్నారు. మిల్టన్ ఫెర్నాండెజ్ పత్తి విత్తనాల కంపెనీలో సైంటిస్టుగా పనిచేస్తుండగా డేజీ ఇవాంజిల్ దేవరయాంజల్‌లోని ప్రముఖ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. జెడెన్ ఫెర్నాండెజ్, అరేలియా మోసెస్ అల్వాల్‌లోని సెయింట్ పాయిస్ పాఠశాలలో 7వ తరగతి, ఎల్‌కేజీ చదువుతున్నారు. దసరా సెలవులు కావడంతో జెడెన్ ఫెర్నాండెజ్ అరేలియా మోసెటసతో పాటు మరో నలుగురు చిన్నారులు విల్లా ఆర్కిడ్స్‌లోని క్లబ్ హౌస్ మెట్ల వద్ద సైకిల్ తొక్కుకుంటూ ఆడుకుంటున్నారు. శనివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో విక్రమ్ నడుచుకుంటూ వచ్చి గేటు వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డులతో మాట్లాడాడు. తాను తిరిగి డ్యూటీలో చేరతానని, లోపలికి వెళ్లి అసోసియేషన్ సభ్యులతో మాట్లాడి బతిమిలాడి వస్తానని వెళ్లాడు. ఆ సమయంలో అందరూ క్లబ్ హౌస్ వెనకాల బతుకమ్మ సంబురాల్లో బిజీగా ఉన్నారు. అరేలియాను అక్కడే అడుకోవాలని, తాను సైకిల్‌పై ఒక రౌండు వేసొస్తానని చెప్పి అన్నయ్య జెడెన్ వెళ్లాడు. సరిగ్గా అదే సమయానికి వచ్చిన విక్రమ్.. అరేలియాను కిడ్నాప్ చేశాడు. చాలా సమయం గడిచినా అరేలియా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెతకడం మొదలుపెట్టారు. వారి ఫిర్యాదుతో బొల్లారం పోలీసులు వచ్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ గుర్తుతెలియని నంబర్ నుంచి దుండగుడు అరుళ్‌దాసకు ఫోన్ చేశాడు. హిందీలో మాట్లాడుతూ అరేలియాను కిడ్నాప్ చేశామని, అప్పగించాలంటే రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సెక్యూరిటీ గార్డులను నిలదీయడంతో విక్రమ్ లోపలికి వచ్చాడని క్లబ్ హౌస్ సెల్లార్ నీటి సంపు వద్ద అరేలియా ఉందని చెప్పి ఆటోలో పరారయ్యాడని చెప్పారు. అక్కడికి వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్న అలేరియా కనిపించింది. కాగా, నిందితుడు విక్రమ్‌ను మల్కాజిగిరి ఎస్‌వోటి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది.

# భర్తను చెట్టుకు కట్టేసి కొట్టి చంపిన భార్య

**ఆస్తి కోసం తరచూ వేధిస్తున్నాడని ఘాతుకం**

**సిద్దిపేట జిల్లా సేవాలాల్ మహారాజ్ తండాలో ఘటన**

**ప్రజా దీవెన, అక్కన్నపేట :** సిద్దిపేట జిల్లా సేవాలాల్ మహారాజ్ తండాలో దారుణం చోటు చేసుకుంది. ఆస్తి పంపకాల విషయంలో గొడవల నేపథ్యంలో ఓ మహిళ తన భర్తను చెట్టుకు కట్టేసి విచక్షణారహితంగా కొట్టి చంపేసింది. భర్త చనిపోయాక స్థానిక పోలీసుస్టేషన్ వెళ్లి లొంగిపోయింది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం సేవాలాల్ మహారాజ్ తండాలో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా నర్మేట మండలం మల్కపేట తండాకు చెందిన బానోతు భగవాన్(43)కు అక్కన్నపేట మండలం సేవాలాల్ మహారాజ్ తండాకు చెందిన మాలోతు రాజేశ్వరికి 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరికీ ఇది రెండో వివాహం కాగా రాజేశ్వరికి మొదటి పెళ్లి ద్వారా ఒక కూతురు ఉంది. రాజేశ్వరికి మొదటి భర్త నుంచి వచ్చిన ఓ ఇల్లు ఆ కూతురి పేరిట ఉంది. అయితే, రాజేశ్వరి-భగవాన్ దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. రాజేశ్వరి మొదటి కూతురి పేరిట ఉన్న ఆస్తిని ముగ్గురు పిల్లలకు సమానంగా పంచాలని భగవాన్ కోరుతున్నాడు. ఈ విషయంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రాజేశ్వరి.. సేవాలాల్ మహారాజ్ తండాలోని తన పుట్టింట్లో ఉండగా.. భగవాన్ ఆదివారం అక్కడికి వచ్చాడు. ఆస్తి పంపకాలపై మళ్లీ గొడవకు దిగాడు. ఈ క్రమంలో సహనం కోల్పోయిన రాజేశ్వరి.. భర్త భగవాన్‌ను చెట్టుకు కట్టేసి తీవ్రంగా కొట్టింది. ఆ దెబ్బలకు భగవాన్ ప్రాణాలు కోల్పోయాడని గ్రహించగానే.. అక్కన్నపేట పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఘటనాస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు.

# ఏఐ వినియోగంలో జవాబుదారీతనం ముఖ్యం

**విద్యారంగంలో ఏఐతో కీలక మార్పులు: మంత్రి శ్రీధర్‌బాబు**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంలో బాధ్యత, పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకోవడంతోపాటు దాని వినియోగంలో ఎదురయ్యే సవాళ్లపైనా దృష్టి పెట్టాలని సూచించారు. డిజిటల్ భద్రతకు ప్రాధాన్యమిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవా లని పిలుపునిచ్చారు. ఆదివారం 'బ్రిలియన్స్ ఏఐ' విద్యా సాంకేతికతను బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో ఏఐ వినియోగం ద్వారా విద్యార్థుల అభ్యాస ప్రక్రియను మరింత మెరుగు పరచవచ్చన్నారు. సంప్రదాయ విద్యావిధానాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు.

# యాసంగి 'వరి' వద్దే వద్దు

**రెండో పంట వేసి ఇబ్బంది పడొద్దు: మంత్రి పొంగులేటి**

**ప్రజా దీవెన, కూసుమంచి :** ఎల్‌నినోతో రాష్ట్రంలో సాగునీటి వనరుల సంక్షోభ పరిస్థితులున్నందు వల్ల యాసంగి పంటగా వరి సాగు చేసి, ఇబ్బందులు పడొద్దని రైతులకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఖరీఫ్ వరిపంటను కాపాడేందుకు ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తోందన్నారు. ఆదివారం ఆయన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో పర్యటించారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల తర్వాత కూసుమంచిలో జరిగిన సభలో మాట్లాడారు. యాసంగి పంటగా వరి సాగు చేస్తే.. నీరందక ఎండిపోయే ప్రమాదం ఉందని, రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితిని తెచ్చుకోవద్దని సూచించారు. ఎల్‌నినోతో విద్యుత్ కొరత తీవ్రమైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# నాలుగైదు రోజుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు

**నేను పోటీ చేయటంపై అధిష్ఠానం నిర్ణయిస్తుంది**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్రంలో త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు తమ పార్టీ అభ్యర్థులను నాలుగైదు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయాలా వద్దా? అనేది జాతీయ నాయకత్వం నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీయే గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఈసారి టికెట్ల కోసం తీవ్ర పోటీ ఉందని, ఆశావహుల వివరాలను అధిష్ఠానానికి పంపినట్లు వెల్లడించారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ తన రాజకీయ స్వార్థం కోసం వాడుకుందని, ఎన్నికల కమిషనర్లను రాజకీయ బానిసలుగా మార్చిన చరిత్ర ఆ పార్టీదని ధ్వజమెత్తారు. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా, భారత్ మాత్రం 7.8 శాతం వృద్ధిరేటుతో దూసుకుపోతోందని చెప్పారు. ప్రభుత్వ అధినేతగా (సీఎం, పీఎంగా) ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాంచందర్‌రావు అధ్యక్షతన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం జరిగింది. మోదీకి అభినందనలు తెలియజేస్తూ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు.

# ఢిల్లీలో మీకు హక్కులు.. తెలంగాణలో మాకు నిర్బంధాలా?

**కాంగ్రెస్ మాటలకు, చేతలకు పొంతనే లేదు**

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాజ్యాంగాన్ని కాపాడతామని పదేపదే చెబుతున్న కాంగ్రెస్ నేతల మాటలకు, చేతలకు పొంతన లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. 'ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ చెబుతున్న మాటలకు, తెలంగాణలో వారి ప్రభుత్వం చేస్తున్న పనులకు ఏ మాత్రం పొంతన కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ రెండు నాలుకల ధోరణికి తాజా పరిణామాలే ఉదాహరణ. 3, 4 రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనల కారణంగా ప్రజలకు అసౌకర్యం కలిగినా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తినా.. అనేక సార్లు ఢిల్లీ పోలీసులు వారికి నిరసన తెలిపే అవకాశాన్ని కల్పించారు' అని కిషన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 'రాహుల్ గాంధీ దేశమంతా స్వేచ్ఛగా తిరుగుతూ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ప్రధాని మోదీపై, కేంద్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు, అబద్ధాలతో విమర్శలు చేస్తున్నారు. ఈసీ, న్యాయవ్యవస్థ, భారత సైన్యంపైనా ఆరోపణలు చేస్తున్నారు. పచ్చి అబద్ధాలు చెబుతున్నా.. ఆయన వాక్‌స్వాతంత్ర్యాన్ని అడ్డుకోవాలని మా ప్రభుత్వం ఏనాడూ ప్రయత్నించలేదు. రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌లోనూ కాంగ్రెస్ నాయకులు సీఈసీని తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించి, లోక్ భవన్ ముందు బైఠాయించారు. అప్పుడు శాంతిభద్రతలు అడ్డు రావా? బీజేపీ నాయకులు ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే మాత్రం సమస్యలన్నీ గుర్తుకొస్తాయా? ఎక్కడికక్కడ మా నాయకులను నిర్బంధిస్తారా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం?' అని ఆయన నిలదీశారు.

# ఓటు కోల్పోయిన వారితో మీదగ్గరికొస్తా..!

**తేదీ, టైమ్ చెప్పాలని బీజేపీ రాష్ట్ర చీఫ్‌కు పొన్నం సవాల్**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** 'సర్ (ఎస్ఐఆర్)' వల్ల ఓటు హక్కు కోల్పోయిన వారిని ఆధారాలతోపాటు తీసుకొస్తా. తేదీ, సమయం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు చెప్పాలి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఓ ప్రకటనలో సవాల్ చేశారు. 'సర్' వ్యతిరేక ఆందోళనలను తప్పు బట్టడంతోపాటు ఈ ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయిన వారు ఉన్నారా? అని రాంచందర్‌రావు అన్న నేపథ్యంలో మంత్రి పొన్నం స్పందించారు. తన తండ్రి పేరులో చిన్నపాటి వ్యత్యాసానికి ఆధారాలు చూపనందుకు తన ఓటునూ తొలగించే ప్రయత్నించారన్నారు. రాష్ట్రంలో 70 లక్షల పై చిలుకు ఓట్లు, హైదరాబాద్‌లోనే 40 లక్షల ఓట్లు తొలగించారని ఆయన ఆరోపించారు.

# అత్యున్నత న్యాయస్థానం అసహనం

**ట్రాఫిక్, మెట్రోపై ఇష్టారాజ్యంగా ఆంక్షలు చెల్లవు.. అత్యవసరమైతేనే బారికేడ్లు**

**ఇంటర్నెట్‌కు అంతరాయం కలిగించవద్దు.. పౌరుల ప్రాథమిక హక్కులను**

**కాపాడటం మా బాధ్యత.. లాయర్లు, జర్నలిస్టులకు అడ్డంకులు కలిగించొద్దు**

**మెట్రోస్టేషన్ల మూసివేత కోర్టు ధిక్కరణే.. దీనిపై అఫిడవిట్ వేయండి: సుప్రీం**

**నిరసనకారుల పట్ల పోలీసులు విచక్షణా రహితంగా వ్యవహరించారు**

**ధర్మాసనానికి విన్నవించిన పలువురు న్యాయవాదులు**

**45 స్టేషన్లే మూసివేశాం.. ఇంటర్నెట్‌ను పునరుద్ధరించాం: సొలిసిటర్ జనరల్**




**న్యూఢిల్లీ :** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పౌరులు, ప్రతిపక్ష నాయకులతోపాటు న్యాయవాదులపైనా పోలీసులు అణచివేత ధోరణి ప్రదర్శించడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. నిరసనకారులను చట్టవిరుద్ధంగా నిర్బంధించడం గానీ, ప్రజా రవాణాను ఇష్టారాజ్యంగా నిలిపివేయడం గానీ చేయకూడదని తేల్చిచెప్పింది. 10వ తేదీన ఢిల్లీలో జరిగిన దాన్ని చిన్నవిషయంగా చూడటం లేదని పేర్కొంది. ట్రాఫిక్, మెట్రోపై ఇష్టారాజ్యంగా ఆంక్షలు చెల్లవని, పౌరుల స్వేచ్ఛా రాకపోకలను అనుమతించాలని ఆదేశించింది. అవసరమైన చోటే బారికేడ్లు పెట్టి, మిగతా వాటిని తొలగించాలని స్పష్టం చేసింది. ఇంటర్నెట్‌కు అంతరాయం కలిగించవద్దని ఆదేశించింది. మెట్రోస్టేషన్లను మూసివేయవద్దని తాము ఆదేశించినా, ఎందుకు మూసివేశారని ప్రశ్నించింది. ఇది కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కిందకు ఎందుకు రాదో వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఢిల్లీలో మెట్రో, రైల్వే సర్వీసుల రద్దు, నిరసనకారుల అణచివేతపై పదుల సంఖ్యలో దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బాగ్చి, జస్టిస్ మోహనలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. "మెట్రోలో ఒక మార్గంలో ప్రారంభ, చివరిస్టేషన్లను మాత్రమే తెరిచి.. మధ్యలో మూసివేస్తే రాకపోకలు ఎలా? ఏయే స్టేషన్లు తెరిచి ఉన్నాయి, ఏవి మూసేశారనే వివరాలను స్పష్టంగా మ్యాప్ ద్వారా నివేదికలో ఇవ్వండి" అని అధికారులను ధర్మాసనం ఆదేశించింది.

**పోలీసు రాజ్యంలా మారిపోయింది..**

పోలీసులు నిరసనకారులపై విచక్షణారహితంగా బలాన్ని ఉపయోగించారని, నేమ్‌బ్యాడ్జీలు కూడా పెట్టుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మహిళా నిరసనకారులతో పురుష పోలీసులు మర్యాద లేకుండా ప్రవర్తించారని ఆరోపించారు. తనవద్ద పనిచేసే ఒక మహిళా జూనియర్ న్యాయవాదిని పోలీసులు వ్యాన్‌లో తీసుకెళ్లి 11 కిలోమీటర్ల దూరంలో నిర్మానుష్య ప్రాంతంలో వదిలేశారని మాజీ అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ధర్మాసనానికి వివరించారు. పేశనివారం నాటి వాతావరణం చూస్తే దేశంలో పోలీసు రాజ్యం ఏర్పడటానికి ఒక్క అడుగు దూరంలోనే ఉన్నామనే భావన కలిగిందని సీనియర్ న్యాయవాది షాదన్ ఫరసాత్ వ్యాఖ్యానించారు.

**15శాతం మెట్రోస్టేషన్లు మాత్రమే మూసివేశాం: సొలిసిటర్ జనరల్**

నిర్బంధించిన వారిలో మెజారిటీ పౌరులను మధ్యాహ్నం 2గంటలకు అదుపులోకి తీసుకుని సాయంత్రం 6 గంటలకే విడుదల చేశామని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరణ ఇచ్చారు. అక్టోబరు 10న షెడ్యూల్ చేసిన 4,157 మెట్రోరైలు ట్రిప్పులను పూర్తిస్థాయిలో నడిపామని చెప్పారు. మొత్తం 303 స్టేషన్లలో కేవలం 15శాతం(45 స్టేషన్లు) మాత్రమే భద్రతా కారణాలతో మూసివేశామన్నారు. ప్రస్తుతం అన్ని మెట్రోస్టేషన్లు తెరిచి ఉన్నాయని, ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించామని ధర్మాసనానికి వివరించారు.

# సీఈసి రాజీనామాకు సీజేపీ పట్టుదల

**మోదీ ప్రధానిగా ఉండడం దేశానికి అవమానకరం**

**సీజేపీ నేతలు దీప్కే, సౌరవ్‌దాస్, రాంకా, షిండే**

**సీఈసీ రాజీనామా చేసేదాకా ఉద్యమం ఆగదని వెల్లడి**

**ఏడాదిపాటు నిరసనల్లో పాల్గొనబోమని కోర్టుకు వీరు బాండ్ రాసిచ్చినట్లు ప్రచారం.. అదేం లేదన్న దీప్కే**



న్యూఢిల్లీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో దేశం మొత్తం ఎమర్జెన్సీని తలపిస్తోందని సీజేపీ నేతలు దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్య షిండే ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం ఢిల్లీలో ఎమర్జెన్సీని ప్రత్యక్షంగా చూశామన్నారు. శనివారం నిరసనల సందర్భంగా దీప్కే, సౌరవ్‌దాస్, అశుతోష్ రాంకాలను అరెస్టు చేసిన పోలీసులు.. ఆదివారం వారిని విడుదల చేశారు. అనంతరం దీప్కే తన నానమ్మ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు స్వగ్రామం హింగోలీకి వెళ్లగా మిగతావారు మీడియాతో మాట్లాడారు. పోలీసుల నిర్బంధం నుంచి విడుదల కాగానే దీప్కే ఎక్స్ వేదికగా మోదీపై విమర్శలు గుప్పించారు. 'మోదీ ప్రధానిగా ఉండటం దేశానికి అవమానకరం. దేశం ఇప్పటివరకు ఇలాంటి ద్రోహిని, పిరికిపందను, నియంతను చూడలేదు' అని మండిపడ్డారు. జ్ఞానేశ్‌కుమార్ సీఈసీ పదవి నుంచి తప్పుకొనేవరకు తమ పోరాటం ఆగదని అజింక్య షిండే ప్రకటించారు. ఇదిలా ఉండగా, పోలీసుల నిర్బంధం నుంచి విడుదలయ్యేందుకు ఏడాదిపాటు ఎలాంటి నిరసనల్లో పాల్గొనకుండా, శాంతికి విఘాతం కలిగించకుండా ఉంటామని సీజేపీ నేతలు కోర్టుకు బాండు సమర్పించారన్న వార్తలపై దీప్కే స్పందించారు. తాము ఎలాంటి బాండుపై సంతకం చేయలేదని స్పష్టంచేశారు. కాగా, శనివారం అరెస్టు చేసిన ప్రముఖ యూట్యూబర్ ధృవ్‌రాఠీని కూడా పోలీసులు ఆదివారం విడుదల చేశారు.

## ఢిల్లీ ఆందోళనలో విద్యార్థులు, మహిళలపై దాడులు

**నలుగురు హిందూ రక్షా దళ్ సభ్యుల అరెస్టు**

ఢిల్లీలో సీజేపీ ఆందోళనల్లో కాషాయ కండువాలు ధరించిన కొందరు వ్యక్తులు నిరసనకారులపై దాడులకు దిగారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై దాడి చేయడంతో పాటు మహిళలతో దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటనలకు సంబంధించి హిందూ రక్షా దళ్ సభ్యులమని చెప్పుకొంటున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అంతకుముందు హిందూ రక్షా దళ్ అధ్యక్షుడు పింకీ చౌదరి ఈ దాడులకు బాధ్యత వహిస్తున్నట్లు 'ఎక్స్'లో పోస్టు చేయడం గమనార్హం.

# 'ఓటు చోరీ'పై నేడు ఇండి కూటమి ఆందోళన

**'చలో ఢిల్లీ - ప్రజాస్వామ్యం కోసం మార్చ్' పేరిట**

**కనాట్‌ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వరకు భారీ ర్యాలీ**

**భారీగా తరలిరావాలని శ్రేణులకు కాంగ్రెస్ పిలుపు**

**వివిధ రాష్ట్రాల నుంచి ఢిల్లీ వెళుతున్న కూటమి నేతలు**

**సీజేఐని కలిసి వినతిపత్రం ఇస్తామన్న ఖర్గే, రాహుల్**

**కలిసేందుకు అనుమతివ్వని జస్టిస్ సూర్యకాంత్**

**యువత స్వరం మరింతగా ప్రతిధ్వనిస్తుంది: రాహుల్**

**దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది: ఖర్గే**

**ఢిల్లీలో భారీగా మోహరించిన భద్రతా బలగాలు**

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా, 'సర్' ప్రక్రియ నిలిపివేత, బ్యాలెట్ పేపర్లతో ఎన్నికల నిర్వహణ డిమాండ్లతో ఇండి కూటమి సోమవారం భారీ ర్యాలీకి సిద్ధమైంది. 'చలో ఢిల్లీ - ప్రజాస్వామ్యం కోసం మార్చ్' పేరిట ఢిల్లీలోని కనాట్‌ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లి.. చీఫ్ జస్టిస్‌కు వినతిపత్రం అందజేస్తామని ఇండి కూటమి నేతలు ప్రకటించారు. కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతోపాటు భారీ సంఖ్యలో యువత ఈ ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. దీనికి అనుగుణంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ముఖ్యమంత్రులు, మంత్రులు, నేతలు, కార్యకర్తలు ఢిల్లీకి చేరుకోనున్నారు. అయితే తనను కలిసి, వినతిపత్రం ఇచ్చేందుకు ప్రతిపక్ష నేతలు చేసిన విజ్ఞప్తిని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఢిల్లీలో వేలాది మంది పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు కొనసాగుతోంది. ఎక్కడా చిన్న నిరసన కూడా కనిపించకుండా బారికేడ్లు, ట్రాఫిక్ మళ్లింపులు, బలగాల తనిఖీలతో కట్టుదిట్టం చేస్తున్నారు. ఆదివారం వామపక్ష విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శనలు చేపట్టగా.. పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఇండి కూటమి ఆందోళనతో పరిస్థితి ఎలా మారుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం ఆదివారం కూడా ఢిల్లీలో భారీ ఎత్తున భద్రతా బలగాలను మోహరించింది. ఎక్కడ చిన్న నిరసన కూడా నిర్వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఊరేగింపుగా బయలు దేరిన వివిధ వామపక్ష విద్యార్థి సంఘాల కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. కన్నాట్ ప్లేస్, జంతర్ మంతర్, మండీ హౌజ్, పటేల్ చౌక్, మధురా రోడ్, సుప్రీంకోర్టు ఆశ్రమం, లాజపత్‌నగర్ మెట్రోస్టేషన్ తదితర 30 ప్రాంతాల్లో బారికేడ్లు పెట్టారు. ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. దీనితో అనేక చోట్ల వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు.




**నేడు 'ఇండి' ర్యాలీ**

సోమవారం ఇండి కూటమి ఢిల్లీలో నిరసన ప్రదర్శనను చేపట్టనుంది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కనాట్‌ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వరకు భారీ ర్యాలీ నిర్వహించి.. సీజేఐ సూర్యకాంత్‌కు వినతిపత్రం సమర్పించాలని కూటమి నేతలు నిర్ణయించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది కార్యకర్తలు, ముఖ్యంగా యువత ఈ ఆందోళనలో పాల్గొనాలని కాంగ్రెస్ పిలుపునిచ్చింది. తెలంగాణ, కర్ణాటక, కేరళం రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్, సతీశన్‌తోపాటు పెద్ద సంఖ్యలో నేతలు ఢిల్లీకి రానున్నారు. మొత్తం పార్టీ ఎంపీలంతా ఢిల్లీ చేరుకోవాల్సిందిగా కాంగ్రెస్ నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్‌తోపాటు ఇతర మిత్రపక్షాల నేతలు, కార్యకర్తలు కూడా ఢిల్లీకి చేరుకోనున్నారు. "సోమవారం పార్టీలకు, కులమతాలు, రాష్ట్రాలకు అతీతంగా భారతీయులుగా సుప్రీంకోర్టు వైపు పాదయాత్రగా సాగుతాం. యువత స్వరం ఇప్పుడు మరింత ప్రతిధ్వనిస్తుంది" అని రాహుల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమల్లో ఉందని ఖర్గే విమర్శించారు.

**ప్రతిపక్ష నేతలతో భేటీకి సీజేఐ నిరాకరణ!**

సోమవారం తనను కలిసేందుకు సమయం కోరిన ప్రతిపక్ష నేతలు రాహుల్, ఖర్గేల విజ్ఞప్తిని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించినట్టు సమాచారం. చీఫ్ జస్టిస్ తన నిర్ణయాన్ని ప్రతిపక్ష నేతల అధికారిక ఈ-మెయిల్ చిరునామాలకు పంపారని, భేటీని నిరాకరించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. తిరస్కరణకు కారణాలు వెల్లడించలేదు.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

# 2028 జూన్ నాటికి శ్రీశైలం సొరంగమార్గం పూర్తి చేయడమే నా జీవిత లక్ష్యం

## నల్లగొండ జిల్లాలో ప్రతి గ్రామానికి డబుల్ రోడ్డు

## గుడిసెలు లేని తెలంగాణే ధ్యేయం

## రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి





**ప్రజా దీవెన, నల్లగొండ:** నల్లగొండ జిల్లా ప్రజల తాగునీటి సమస్య కు ఉపశమనం కల్పించడంతో పాటు, రైతులకు సాగునీటి భద్ర త కల్పించి ఫ్లోరైడ్ సమస్యకు శా శ్వత పరిష్కారం చూపడమే ల క్ష్యంగా శ్రీశైలం సొరంగ మార్గం (ఎస్ఎల్‌బీసీ) పనులను వేగ వం తం చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భ వనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. 2028 జూన్ నాటికి సొరంగ మార్గం పనులు పూర్తి చేయడం తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశారు. దీంతో రైతులకు రెండు పంటలకు సాగునీరు అం దించేందుకు మార్గం సుగమమ వుతుందని పేర్కొన్నారు. జిల్లాలో మౌలిక వసతుల అభి వృద్ధిలో భాగంగా ఆదివారం కన గల్ మండలంలో సుమారు రూ. 74 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారుల విస్తర ణ, పటిష్టపరిచే పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా అభివృద్ధి పనులు, సాగు నీటి ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇ ళ్లు, ప్రజా సంక్షేమ పథకాలపై మా ట్లాడారు.

### రూ.74 కోట్లతో రహదారుల అభి వృద్ధి

కనగల్ మండలం తెలకంటిగూ డెం వద్ద రూ.41 కోట్లతో తెల కం టిగూడెం నుంచి తొరగల్లు, జంగ మాయిగూడెం మీదుగా ముషం పల్లి వరకు రహదారి విస్తరణ, ప టిష్టపరిచే పనులకు మంత్రి శం కుస్థాపన చేశారు. అలాగే షేరి లింగోటం వద్ద రూ.33 కోట్లతో న ల్లగొండ--నిడమనూరు రహదారి నుంచి చెట్లచెన్నారం, చిన్నమా దారం, తంగెళ్లవారిగూడెం మీ దు గా ముషంపల్లి వరకు చేపట్టను న్న రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నల్లగొండ జిల్లాలో ఇప్పటికే సు మారు రూ.1,600 కోట్లతో రహ దారుల నిర్మాణం చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రూ.900 కోట్ల తో నల్లగొండ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతు న్నాయని చెప్పారు. రహదారు లు మెరుగుపడితే పరిశ్రమలు, రై స్ మిల్లుల ఏర్పాటుకు అవకాశా లు పెరుగుతాయని, రవాణా సౌ కర్యాలు మెరుగై యువతకు ఉ ద్యోగావకాశాలు లభిస్తాయని వి వరించారు. భూముల విలువ కూడా పెరుగుతుందని పేర్కొన్నా రు. జిల్లాలోని ప్రతి గూడెం, గ్రా మానికి డబుల్ రోడ్డు సౌకర్యం క ల్పించడమే లక్ష్యమని వెల్లడిం చారు.

### ఎస్ఎల్‌బీసీ పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు

గత ప్రభుత్వ హయాంలో నిలి చి పోయిన ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులను ప్రజా ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన త ర్వాత తిరిగి ప్రారంభించామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పను లు కొనసాగుతున్నాయని, ఇ ప్పటివరకు సుమారు 800 మీ టర్ల మేర పనులు పూర్తయ్యా యని చెప్పారు.సొరంగ మార్గం పూర్తయితే దేవరకొండ, మును గోడు ప్రాంతాలకు సాగునీరు అం దించడంతో పాటు, నల్లగొండ ని యోజకవర్గంలో సుమారు 2.30 లక్షల ఎకరాలకు సాగునీటి సౌక ర్యం కల్పించే అవకాశం ఉంటుం దని తెలిపారు. ప్రజలకు తాగునీ టి భద్రత చేకూరడంతో పాటు ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి దో హదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గంధమల్ల, బస్వా పురం ప్రాజెక్టుల పనులను కూడా వేగవంతం చేస్తామని వెల్లడించా రు.

### జాతీయ రహదారుల అభివృద్ధికి చర్యలు

తెలంగాణలో రహదారులను దే శానికే ఆదర్శంగా నిలిచేలా అభి వృద్ధి చేస్తామని కోమటిరెడ్డి వెంక ట్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ -- విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధికి రూ.12 వేల కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పా రు. జాతీయ రహదారులపై గు ర్తించిన 17 ప్రమాదకర ప్రాంతా ల్లో అభివృద్ధి పనులు చేపడుతు న్నామని, వచ్చే సంక్రాంతి నాటికి వాటిని పూర్తి చేయాలని లక్ష్యం గా పెట్టుకున్నట్లు వివరించారు. యాదాద్రి--భువనగిరి రహదారి పనులను నవంబర్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

గుడిసెలు లేని తెలంగాణ నిర్మిం చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. తెలకంటి గూడెంలో ఇప్పటికే 107 ఇందిర మ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఇంకా ఇళ్లు మంజూరు కాని అర్హులైన కుటుం బాలకు కూడా ఇళ్లు అందించేం దుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎల్-1, ఎల్-3 కేటగిరీ ల్లో సాంకేతిక సమస్యలు ఎదురై నా అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల పట్టాలు లేని వడ్డెర కులస్తులకు పట్టాలు అందించినట్లు వివరిం చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వా త రేషన్ కార్డులు, ఉచిత విద్యు త్, సన్నబియ్యం పంపిణీ, స్వ యం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, మహిళలకు ఉచి త బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణ మాఫీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బ తుకమ్మ పండుగ సందర్భంగా మ హిళలకు చిలకపచ్చ రంగు చీర లు అందించేందుకు ప్రభుత్వం చ ర్యలు తీసుకుంటోందని చెప్పా రు.

### నీటిని పొదుపుగా వినియోగించు కోవాలి

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి కరువు పరిస్థితులు ఏర్పడే అవ కాశం ఉన్నందున ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవా లని మంత్రి విజ్ఞప్తి చేశారు. తాగు నీటిని వృథా చేయకుండా కాపా డుకోవాలని, పంటలను రక్షించు కునేందుకు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని రైతుల కు సూచించారు. నాగార్జునసాగ ర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉ న్నప్పటికీ, పరిసర గ్రామాల తా గునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని చెరువులను నింపేం దుకు చర్యలు తీసుకున్నట్లు తెలి పారు.రైతులు సంతోషంగా ఉం డాలని, పేదల ముఖాల్లో చిరున వ్వులు చూడాలన్నదే తన ఆకాం క్ష అని మంత్రి పేర్కొన్నారు. శ్రీశై లం సొరంగ మార్గాన్ని నిర్దేశిత గ డువులో పూర్తి చేసి ప్రతి ఎకరా కు సాగునీరు అందించేందుకు కృ షి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఆర్అండ్‌బీ ఎస్ ఈ మోహన్, ఆర్డీవో వై. అశోక్‌రె డ్డి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, కనగల్ తహసీల్దార్ పద్మ, ఎంపీ డీవో వేద రక్షిత, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ ము న్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు, ఇతర ప్రజాప్రతిని ధులు, అధికారులు పాల్గొన్నారు.





# మిర్యాలగూడలో అగ్నిప్రమాదం

### మంటల్లో చిక్కుకున్న ఐదుగురిని చాకచక్యంగా కాపాడిన పోలీసులు

### సమయస్ఫూర్తితో ఐదుగురికి ప్రాణదానం



**ప్రజా దీవెన, నల్లగొండ జిల్లా:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ప ట్టణంలోని ఇస్లాంపుర ప్రాంతం లో చోటుచేసుకున్న అగ్నిప్రమా దం తీవ్ర కలకలం రేపింది. చెప్పు ల దుకాణం ఉన్న భవనంలో ఒ క్కసారిగా మంటలు చెలరేగడం తో పై అంతస్తుల్లో నివసిస్తున్న కుటుంబ సభ్యులు ప్రాణభయం తో వణికిపోయారు. మంటలతో పాటు దట్టమైన పొగ వ్యాపించ డంతో బయటకు వచ్చే మార్గం క నిపించక భవనంలో చిక్కుకున్న వారు సహాయం కోసం ఆర్తనాదా లు చేశారు.

### అప్రమత్తమైన పోలీసులు..ఐదు గురికి పునర్జన్మ

అగ్నిప్రమాద సమాచారం అందు కున్న మిర్యాలగూడ వన్‌టౌన్ పో లీసు సిబ్బంది ఏమాత్రం ఆల స్యం చేయకుండా సంఘటనా స్థ లానికి చేరుకున్నారు. పరిస్థితిని అంచనా వేసి వెంటనే సహాయక చర్యలు చేపట్టి, భవనంలో చి క్కుకున్న ఐదుగురు కుటుంబ స భ్యులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. మంటలను అదు పులోకి తెచ్చేందుకు కూడా చర్య లు చేపట్టారు.

### పోలీసుల సమయస్ఫూర్తికి ప్రశం సలు

ప్రమాద సమయంలో వేగంగా స్పందించి ఐదుగురి ప్రాణాలను కాపాడిన మిర్యాలగూడ వన్ టౌ న్ పోలీసుల సేవలు అభినం దనీ యం. అత్యవసర పరిస్థితుల్లో ప్ర జల రక్షణకు పోలీసులు ఎల్లప్పు డూ అప్రమత్తంగా ఉంటారనే వి షయాన్ని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. ఆపదలో అండగా నిలిచి.. ఐదుగురి ప్రాణాలను కా పాడిన పోలీసులకు అభినందన లు వెల్లువెత్తుతున్నాయి.

# నిర్మాణా పనులకుశంకుస్థాపన



**ప్రజా దీవెన, కోదాడ:** మండల పరిధిలోని గుడిబండ గ్రామ పంచాయతీ పరిధిలోని పాత గుడిబండ శ్మశాన వాటికకు వెళ్లే దారిలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.2 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి గ్రామ పాలకవర్గం తీర్మానంచారు గ్రామ కార్యదర్శి అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారము గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య సీసీ రోడ్డు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు .ఈ సందర్భంగా సర్పంచ్ మందుల నాగయ్య గారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన పనులను చేపడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారం, ఆశీస్సులతో భవిష్యత్తులోనూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలక్షసింహారెడ్డి గ్రామ పెద్దలు ఇర్ల నర్సింహారెడ్డి కుక్కడపు సైదులు, వార్డుసభ్యులు చక్రు, దారా అఖిల్, ఎర్రమళ్ళ రోజా, చుక్క సుహాసిని కుక్కడపు ఖాజా పులి అనిత ఎరగాని నాగశేషగౌడ్ రాజుల లింగయ్య ఫీల్డ్ ఆఫీసర్ బిక్షం, దారా ప్రేమ్ కుమార్, పవన్, కాంట్రాక్టర్ నరేష్, గ్రామపంచాయతీ సిబ్బంది సూరయ్య తిరుమలి తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా పాస్టర్స్ డే వేడుకలు



**ప్రజా దీవెన,కోదాడ:** పట్టణములో బాప్టిస్ట్ చర్చ్ లో క్రిస్టియన్ మైనారిటీ నాయకులు పాస్టర్ వంటిపాక యేసయ్య ఆధ్వర్యంలో పాస్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించార ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సంఘ కాపరి సంఘస్తుల ఆధ్యాత్మిక ఎదుగుదల కొరకు నిరంతరం ప్రార్థించేవారని, వారి ఆత్మీయ ఎదుగుదల కొరకు నిత్యం శ్రమిస్తూ సంఘాన్ని నిర్మించి సమాజంలో ఉన్నతమైన వారిగా తీర్చిదిద్దే గొప్ప సేవకుడని కొనియాడారు. అలాగే తమకు ఎదురయ్యే కష్టనష్టాలను, వ్యతిరేకతలను, ప్రతికూల పరిస్థితులను సైతం ధైర్యంగా ఎదుర్కొంటూ సంఘాన్ని ముందుకు నడిపించే గొప్ప సేవకుడని ప్రశంసించారు. అనంతరం పాస్టర్ యేసయ్య కోదాడ మున్సిపల్ క్రిస్టియన్ మైనారిటీ మాజీ కోఆప్షన్ సభ్యురాలు వంటిపాక జానకి యేసయ్యను న శలువ పూలమాలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో నడిగూడెం మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి బాబు, సంఘ పెద్దలు బల్లికొండ కోటయ్య జాన్, జగ్గు నాయక్, మోజస్, రాంబాబు, గురునాథ్, విజయ్ ఏనుష్, స్రవంతి, శార, అరుణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తి మండలంలో ఎండిపోతున్న వరి పొలాలు

### రైతులను పట్టించుకునే నాథుడే లేడా? తీవ్ర ఆవేదనలో అన్నదాతలు



**ప్రజా దీవెన, తుంగతుర్తి:** తుంగతుర్తి మండలం లో ఒకపక్క తీవ్ర విద్యుత్ అంతరాయాలు, మరోపక్క వర్షాలు సరిగా లేక, గోదావరి జలాలు అందకపోవడంతో వరి పొలాలు నిట్ట నిలువునా ఎండిపోతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు నిండి, కొంతమేర భూగర్భ జలాలు పెరిగినప్పటికీ, తీవ్ర విద్యుత్ కోతతో పొలాలు ఎండిపోతుండటం చూసి రైతన్నలు బెంబేలెత్తుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో వరి పొలాలు కొన్ని పొట్ట దశలో, మరికొన్ని పాలు పోసుకుంటున్న దశలో, మరికొన్ని పంట చేతికి వచ్చే దశలో ఉన్నాయి. ఈ కీలక తరుణంలో విద్యుత్ కోత రైతులకు శాపంగా మారింది. వస్తున్న విద్యుత్ లో మధ్య మధ్యలో అంతరాయాలు తీవ్రమయ్యాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమను పట్టించుకునే నాథుడే లేడని ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. తుంగతుర్తి మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో భూగర్భ జలాలు కొద్దిమేర పెరిగినా, విద్యుత్ కోతే ప్రధాన సమస్యగా మారిందని రైతులు అంటున్నారు. వచ్చే విద్యుత్ లో తీవ్ర అంతరాయాలు వస్తుండటంతో వరుస తడురు కట్టి పొలాలను కాపాడుకునే పనిలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొదటి మడికి నీరు పెడితే చివరి మడి పొలం ఎండిపోతుందని, చివరి మడికి పెడితే మొదటి మడి పొలం ఎండుతుందని ఆవేదన చెందుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్ లో అన్ని కష్టాలు ఎదురయ్యాయని, తమను పట్టించుకునే వారే లేరా అని ప్రశ్నిస్తున్నారు. బోర్లలో కొద్దిగా నీరున్నా, విద్యుత్ లేక ఆ నీటిని వ్యవసాయానికి వినియోగించుకోలేకపోతున్నామని, దీనికి ప్రధాన కారణం తీవ్ర విద్యుత్ సమస్యేనని చెబుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, మొదట్లో వర్షాలు రాక ఇబ్బంది పడ్డామని, ఆ తర్వాత అకాల వర్షాలతో చెరువులు నిండటం కొంత ఆనందాన్నిచ్చినా, ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదని, ఇప్పుడు విద్యుత్ కోత రూపంలో శాపంగా మారిందని వాపోతున్నారు. మండలంలో కరువు వర్షాలు లేక రాలేదని, విద్యుత్ అంతరాయంతోనే వస్తోందని రైతులు అంటున్నారు. ప్రజాప్రతినిధులు కనీసం విద్యుత్ అంతరాయం గురించి పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల గోడు పట్టించుకుని ఇకనైనా అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తును సక్రమంగా, సరైన సమయంలో, లో వోల్టేజీ లేకుండా వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఎండిపోతున్న పంటలను కాపాడాలని యావత్ రైతాంగం కోరుతోంది.

## మునుగోడు ప్రజల తాగు, సాగు నీటి విషయంలో

# రాజీపడే ప్రసక్తే లేదు

**ఫ్లోరైడ్ మహమ్మారికి శాశ్వత పరిష్కారమే లక్ష్యం**

**డిండి ఎత్తిపోతల పథకంపై రాజ్‌గోపాల్ రెడ్డి సమీక్ష**

**ఏదుల రిజర్వాయర్ నుంచి నీటి తరలింపునకు కార్యాచరణ వేగవంతం**

**రూ.1,800 కోట్లతో ప్రాజెక్టుకు ప్రభుత్వ నిధుల మంజూరు**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ఫ్లోరైడ్ సమస్యతో దశాబ్దాలుగా సత మ తమవుతున్న మునుగోడు ని యోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడంతో పా టు, రైతుల సాగునీటి అవసరా లను తీర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మును గోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ప్ర జ ల ఆరోగ్యం, రైతుల భవిష్యత్తు తో ముడిపడిన నీటి సమస్య ప రిష్కారంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచె ప్పారు.

### డిండి ఎత్తిపోతల పథకంపై కీలక సమీక్ష

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపో తల పథకంలో భాగంగా చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకంతో పా టు, మునుగోడు నియోజకవర్గం లోని లక్ష్మణాపురం, శివన్న గూ డెం రిజర్వాయర్లకు నీటిని తర లించే అంశంపై హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ వి శ్రాంత ఇంజనీర్ల ప్రతినిధులతో ఎ మ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వ హించారు. నీటి తరలింపు, భూ సేకరణ, హెడ్‌వర్క్స్ నిర్మాణం త దితర అంశాలపై విస్తృతంగా చ ర్చించారు. గత బీఆర్ఎస్ ప్రభు త్వ హయాంలో ఈ ప్రాజెక్టులకు నీటిని ఎక్కడి నుంచి తరలిం చా లనే అంశంపై స్పష్టమైన కా ర్యా చరణ లేకుండా పోయిందని పే ర్కొన్న రాజ్‌గోపాల్ రెడ్డి, ప్రజా ప్ర భుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన చొరవతో ఏదుల రి జర్వాయర్ నుంచి నీటిని తరలిం చే దిశగా నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ పనుల కోసం ప్రభుత్వం రూ. 1,800 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు.

### పనులన్నీ పూర్తయ్యేలా కృషి

ఏదుల రిజర్వాయర్ నుంచి నీటి ని తరలించేందుకు చేపట్టాల్సిన పనులతో పాటు, లక్ష్మణాపురం, శివన్నగూడెం ప్రాజెక్టుల పరిధిలో ని హెడ్‌వర్క్స్ నిర్మాణం, భూసేక రణ, ఇతర అనుబంధ పనులను వేగవంతం చేసేలా ప్రభుత్వంతో మాట్లాడతానని విశ్రాంత ఇంజనీ ర్ల ప్రతినిధులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కేబినెట్ తీసుకున్న ని ర్ణయానికి అనుగుణంగా ప్రాజెక్టు పనులు ముందుకు సాగేలా అ వ సరమైన చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు.



### మునుగోడుకు తాగు, సాగునీరు అందించడమే ధ్యేయం

ఏదుల రిజర్వాయర్ నుంచి నీటి తరలింపు అంశంపై చర్చలు జరు గుతున్న నేపథ్యంలో, మునుగో డు ప్రజల అవసరాలే తమకు అ త్యంత ప్రాధాన్యమని రాజ్‌గోపా ల్ రెడ్డి స్పష్టం చేశారు. ఫ్లోరైడ్ స మస్య నుంచి ప్రజలకు ఉపశమ నం కల్పించడంతో పాటు, వ్యవ సాయానికి అవసరమైన నీటిని అందించి రైతుల జీవితాల్లో మా ర్పు తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. డిండి ఎత్తిపోతల పథకం, లక్ష్మణాపురం, శివన్నగూ డెం రిజర్వాయర్ల పనులు పూర్త యితే మునుగోడు ప్రాంతంలో తాగునీరు, సాగునీటి అవసరాల పరిష్కారానికి కీలక ముందడుగు పడుతుందని ఆశాభావం వ్యక్త మైంది. ఈ సమావేశంలో తెలంగాణ వి శ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్షు డు మేరెడ్డి శ్యాంప్రసాద్ రెడ్డి, ప్ర ధాన కార్యదర్శి తన్నీరు వెంకటే శం, సలహాదారులు వి. వెంక ట రామారావు, ఎం. సత్తిరెడ్డి, ఇంద్ర సేనారెడ్డి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతును అవమానించిన గజ్వేల్ తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

### సిద్దిపేట జిల్లాలో అధికారుల చర్యలు

### ఆర్డీవో ప్రాథమిక నివేదిక ఆధా రంగా ఉత్తర్వులు

**ప్రజా దీవెన, గజ్వేల్:** భూసమ స్య పరిష్కారం కోసం వచ్చిన రై తుతో అనుచితంగా వ్యవహరించిన గజ్వేల్ తహసీల్దార్ చిట్టం పల్లి స్వామిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. రైతును కించపరిచేలా మాట్లాడిన ఘటన పై ఆర్డీవో సమర్పించిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. భూసమస్య పరిష్కారం కోసం త న వద్దకు వచ్చిన రైతుతో తహ సీల్దార్ స్వామి దురుసుగా వ్యవ హరించడమే కాకుండా, "ఇంకా చనిపోలేదా?" అంటూ అవమా నకరంగా మాట్లాడినట్లు ఆరోప ణలు వచ్చాయి. ప్రజా సమస్యల ను పరిష్కరించాల్సిన బాధ్యతా యుతమైన స్థానంలో ఉన్న అధి కారి, రైతు పట్ల ఇలాంటి వ్యాఖ్య లు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనను ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి, ఆర్డీవో ప్రాథమిక నివేదిక ఆధారంగా తహ సీల్దార్ స్వామిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదుప రి ఆదేశాలు వచ్చే వరకు అను మతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. రైతుల సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరిం చాల్సిన అధికారులు, ప్రజల ప ట్ల గౌరవంగా మెలగాలనే అంశా న్ని ఈ ఘటన మరోసారి చర్చకు తెచ్చింది.

## రాష్ట్రస్థాయి అండర్-19 కబడ్డీ జట్టుకు షేక్ నస్రీన్ ఎంపిక



**శాలిగౌరారం :** జిల్లాస్థాయి అండర్-19 బాలికల అసోసియేషన్ కబడ్డీ పోటీలలో ప్రతిభ కనబరిచిన శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థిని షేక్ నస్రీన్ రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైంది. శాలిగౌరారం మండలం వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్ లో పదవ తరగతి చదువుతున్న షేక్ నస్రీన్ (జాలోనిగూడెం ) జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. అక్టోబర్ 13 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఆమె ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని షేక్ నస్రీన్ ను, ఆమెకు శిక్షణ ఇచ్చిన పిడి బొడ్డు మల్లేష్ ను ఉపాధ్యాయిని, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ఢిల్లీలో నిరసనలపై దమనకాండను ఖండిస్తున్నాం : వేముల గోపీనాథ్



**శాలిగౌరారం :** ఢిల్లీలో సీఈసీ తొలగింపు, సర్ రద్దు, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహణ డిమాండ్ చేస్తూ నిరసన తెలిపిన వారిపై లాఠీచార్జి, అక్రమ నిర్బంధాలను తీవ్రంగా ఖండిస్తున్నామని శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ అన్నారు. అయన ఆదివారం విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ప్రజల గొంతును పోలీసు బలగాలతో అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సీఈసీ ను తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి అత్యధిక ప్రవేశాలు రావాలి




**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ కోర్సు ల్లో గతంలో మాదిరిగానే ఈ వి ద్యా సంవత్సరం కూడా అత్య ధిక సంఖ్యలో ప్రవేశాలు నమోద య్యేలా కృషి చేయాలని యూ నివర్సిటీ ఎడ్యుకేషన్ ఎక్స్టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి. ధర్మ నాయక్ సూచించారు. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 13వ తేదీతో గడువు ముగియనుందని,గడువు పొడిగింపు ఉండదని చేశారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆదివారం నల్లగొండ ప్రాంతీయ సమ స్వీయ కేంద్రంలో అధ్యయన కేంద్రాల కోఆర్డినే టర్లు, కౌన్సిలర్లతో నిర్వహించిన సమీక్ష సమావే శంలో డాక్టర్ బి. ధర్మ నాయక్ మాట్లాడారు. అనం తరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనివర్సిటీ కోర్సులు, ప్రవేశాల వివరాలను వెల్ల డించారు. ఉన్నత విద్యను అందరికీ చేరువ చేయడం తోపాటు విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొం దించి, ఉద్యోగ,ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో బీఆర్ఏఓయూ పలు కోర్సులను అందుబా టులోకి తీసుకొచ్చిందని ధర్మ నాయక్ తెలిపారు. యూనివర్సిటీ ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీతోపాటు ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల్లో ప్రవే శాలు పొందవచ్చని వివరించారు. ఉ ద్యోగాలు చేస్తు న్నవారు, కుటుంబ బాధ్యతల కారణంగా సంప్ర దాయ కళాశాలల్లో చదువుకోలేకపోతున్నవారు, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమకు అనుకూలమైన సమయంలో విద్యాభ్యాసాన్ని కొనసాగించే వెసులుబాటు ఈ విధానం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సమా వేశంలో నల్లగొండ ప్రాంతీయ సమన్వయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ కుమార్ బొజ్జ, మహిళా డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ భూక్యా వీరన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## శాలిగౌరారం బీసీ కాలనీలో కొలువుదీరిన దుర్గమ్మ

### ఘనంగా నవరాత్రి ఉత్సవాల ప్రారంభం



**శాలిగౌరారం :** శాలిగౌరారం మండల కేంద్రంలోని మార్కెట్ బీసీ కాలనీలో దుర్గామాత విగ్రహ ప్రతిష్టతో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాలనీవాసులు ఏర్పాటు చేసిన మండపంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించారు. 16 మంది భక్తులు భవానీ దీక్ష మాల ధరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. దుర్గామాత విగ్రహాన్ని కల్లూరి సైదులు - విమల దంపతులు విరాళంగా అందజేశారు. విగ్రహ ప్రతిష్ట, పూజా కార్యక్రమాలను గ్రామ పురోహితులు రామడుగు వెంకట్రామ శర్మ నిర్వహించారు.

## పూలను పూజించే సంస్కృతి తెలంగాణ ఆడపడుచులది

### ఆడపడుచుల ఆత్మ గౌరవం బతుకమ్మ... మున్సిపల్ చైర్పర్సన్



**ప్రజాదీవెన, కోదాడ:** పూలను పూజించే సంస్కృతి ఒక్క తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ఉన్నదని బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, అని మున్సిపల్ చైర్పర్సన్ ఎర్నేని కుసుమ అన్నారు. శనివారం కోదాడ బాయ్స్ హై స్కూల్ నందు కోదాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకల్లో భాగంగా రెండవ రోజు అటుకుల బతకమ్మ సందర్భంగా గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించి అందరితో కలిసి బతుకమ్మ ఆటపాటల్లో పాల్గొన్నారు . అనంతరం ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ అంటే "బతుకు అమ్మా!" అని అర్థం. అమ్మవారిని ప్రకృతి స్వరూపిణిగా భావించి, వివిధ రకాల కాలానుగుణ పూలతో బతుకమ్మను పేర్చి, భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. మహిళలు, బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకుంటారని తెలిపారు. బతుకమ్మ పండుగ రోజు వారి విశిష్టత గురించి వివరించారు. బతుకమ్మ పండుగ విశిష్ఠత ప్రకృతి ఆరాధన తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి పూలతో ప్రకృతిని పూజించడం జరుగుతుందన్నారు. గౌరీదేవిని పూజిస్తూ మహిళల జీవన సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సును ఆకాంక్షించడం స్త్రీల గౌరవం అని అన్నారు. కులమత భేదాలు లేకుండా మహిళలంతా ఒకచోట చేరి పండుగ జరుపుకోవడం బతుకమ్మ ప్రత్యేకత అన్నారు. జానపద పాటలు, ఆటలు, సంప్రదాయ దుస్తులు, పూల అలంకరణలతో ప్రాంతీయ వారసత్వాన్ని కాపాడుకోవడం, స్థానికంగా లభించే పూలను ఉపయోగించడం ద్వారా ప్రకృతితో మనిషికి ఉ న్న అనుబంధాన్ని గుర్తు చేశారు బతుకమ్మను సాధారణంగా ఆశ్వయుజ మాసంలో మహాలయ అమావాస్య నుంచి తొమ్మిది రోజులపాటు జరుపుకుంటా రు. ప్రతి రోజుకు ఒక ప్రత్యేకమైన పేరు, నైవేద్యం, ఆచార ప్రాధాన్యం ఉంటాయి అన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేవరపల్లి మల్లేశ్వరి నూనె సులోచన, మున్సిపల్ అధికారులు స్థానిక నాయకులు కౌన్సిలర్ వంగూరి గోపి, రావెళ్ళ కృష్ణ కొల్లు క్షత్రియ, మందలపు శేషయ్యః, మైలారి శెట్టి భాస్కర్, మల్లె కొండలు, ఎర్నేని రత్న కుమార్ మాతంగి శైలజ కేజమ్మ , రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్‌గా భాస్కర్



**శాలిగౌరారం :** కురుమ యువ చైతన్య సమితి తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్‌గా నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన గుడపూరి భాస్కర్ కురుమ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు కుండే వెంకటేష్ కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ మోటే రవి కురుమ, రాష్ట్ర కమిటీ సంయుక్తంగా ఈ నియామకం చేపట్టారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర నాయకత్వానికి భాస్కర్ కురుమ కృతజ్ఞతలు తెలిపారు. కురుమ యువత చైతన్యం కోసం, సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని భాస్కర్ కురుమ తెలిపారు.

# నల్లగొండ రెడ్‌క్రాస్ ఎన్నికల్లో ఉత్కంఠ

**హేమలత, అమరేందర్ రెడ్డి మధ్య హోరాహోరీ**

**ఏడు రౌండ్ల ఓట్ల లెక్కింపులో ఆధిక్య స్థానాలు మార్పులు**

**15 మంది నిర్వహణ కమిటీ సభ్యుల ఎన్నిక పూర్తి**





**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** నల్లగొండ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో ఉత్కంఠ నెల కొంది. ఓట్ల లెక్కింపు చివరి వరకు ఆసక్తికరంగా సాగగా, పలువురు అభ్యర్థుల మధ్య స్వల్ప ఓట్ల తేడా పోటీని మరింత రసవత్తరంగా మార్చింది. ముఖ్యంగా డాక్టర్ హేమలత, గోలి అమరేందర్ రెడ్డి మధ్య ఆధిక్యం మారుతూ రావడంతో అభ్యర్థులు, వారి మద్దతుదారుల్లో ఉత్కంఠ నెల కొంది.నాలుగో రౌండ్ ముగిసే సమయానికి హేమలత 350 ఓట్లతో ఆధిక్యంలో కొనసాగగా, అమరేందర్ రెడ్డి 342 ఓట్లు సాధించారు. పుల్లారావు 327, మిర్యాల యాదగిరి 317, టి. సుధారాణి 339, ఆకవరం లతాకుమారి 332, అమంచి రాజలింగం 336, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి 285 ఓట్లు సాధించారు. తొలి రెండు రౌండ్లలో హేమలత 174 ఓట్లతో మొదటి స్థానంలో ఉండగా, అమరేందర్ రెడ్డి 173 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఒక్క ఓటు తేడాతో సాగిన పోటీలో తదుపరి రౌండ్ల ఫలితాలు ఆసక్తిని పెంచాయి.మొత్తం ఏడు రౌండ్లలో జరిగిన ఓట్ల లెక్కింపులో 1,385 మంది ఓటర్లు పాల్గొనగా, 32 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. వీరిలో 15 మంది నిర్వహణ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం అధికారులు విజేతలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.



**ప్రశాంతంగా ఎన్నికలు.. కీలక పదవులపై ఉత్కంఠ**

రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా సహకార అధికారి మమత వెల్లడించారు. ఓట్ల లెక్కింపు తెల్లవారుజాము న 2 గంటల వరకు కొనసాగడంతో నిర్వహణ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి తదితర కీలక పదవులకు ఎన్నికలను ఈ రోజు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

15 మంది నిర్వహణ కమిటీ సభ్యులు ఎన్నిక కావడంతో కొత్త పాలకవర్గం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇప్పుడు చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి పదవులు ఎవరిని వరించనున్నాయన్నది ఆసక్తికరంగా మారింది. కీలక పదవుల ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గ వివరాలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు.ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించిన పోలీసు శాఖ, సహకార శాఖ సిబ్బంది, నల్లగొండ ప్రజలకు అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.నల్లగొండ రెడ్ క్రాస్ సొసైటీకి కొత్త పాలకవర్గం కొలువుదీరనున్న నేపథ్యంలో.. కీలక పదవుల ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## రూ.500 కోట్ల నిధులు కేటాయించాలి

**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్ :** విశ్వబ్రాహ్మణులైన పంచదాయల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు దాసోజు యాదగిరి చారి, ప్రధాన కార్యదర్శి పెండోట సోములు ప్రభుత్వాన్ని కోరారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్న తరహాలోనే విశ్వబ్రాహ్మణులకు సైతం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి, వారి ఆర్థిక,సామాజిక అభివృద్ధికి అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వంనకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని విశ్వకర్మ భవన్ ఆదివారం నిర్వహించిన విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. కమ్మరి, వడ్రంగి, కౌసలి, కంచరి, శిల్పి వృత్తులకు చెందిన విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సేవా సంస్థ నూతన మహిళా ఉపాధ్యక్షురాలిగా తవిటి ఇందిరారాణి, కార్యవర్గ సభ్యుడిగా చోల్లేటి యాదగిరి, వివాహపరిచే వేదిక కన్వీనర్ గా పర్వతం నరేంద్రబాబు ని నియమించారు. నూతనంగా నియమితులైన వారిని నాయకులు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు శ్రీపాద కృష్ణమాచారి, కొండోజు కృష్ణమాచారి, షణ్ముఖ చారి, కోశాధికారి తరునోజు భీష్మాచార్య, కార్యవర్గ బాధ్యులు దాసోజు బ్రహ్మాచారి, కొల్లోజు ఓంకార చారి, కటకం వెంకటాచారి, పందిళ్ళపల్లి బ్రహ్మాచారి, పర్వతం శోభారాణి, శివకోటి హరిప్రసాద్, పర్వతం నరేంద్రబాబు, కూరెళ్ళ రాఘవాచారి, ఉమారాణి తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మునుగోడు మండల వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు

**శ్రీఆధ్య హాస్పిటల్ ఎండి. దేశిడి రాజుగౌడ్**



**ప్రజా దీవెన, మునుగోడు :** శ్రీఆద్య హాస్పిటల్ ఆధ్వర్యంలో త్వరలోనే మునుగోడు మండల వ్యాప్తంగా ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తానని శ్రీఆద్య హాస్పిటల్ ఎండి. దేశిడి.రాజుగౌడ్ తెలిపారు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నా సొంత మండలం అయినా మునుగోడు. మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు నా వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని స్పష్టం చేశారు.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సేవ చేసే అవకాశం నాకు లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎంతో అనుభవమైనటువంటి డాక్టర్లతో ప్రతి గ్రామంలో వైద్య సేవలు నిర్వహించేందుకు ముందుకు వస్తున్నాను అని అన్నారు.. ఈ ఉచిత వైద్య శిబిరాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మునుగోడులో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**పూల పండుగలో మురిసిన ఆడపడుచులు**

**మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన కోమటిరెడ్డి లక్ష్మీ**



**ప్రజా దీవెన, మునుగోడు:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు నల్లగొండ జిల్లా మునుగోడులో అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల కోలాటాలు, జానపద గీతాలు, ఆటపాటలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. మునుగోడు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన మహిళలు బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మీ మహిళలతో కలిసి బతుకమ్మలను తీసుకుని వేడుకల ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి, 15 అడుగుల భారీ బతుకమ్మకు హారతి ఇచ్చి వేడుకలను ప్రారంభించారు.

**మహిళలతో కలిసి ఆటపాటల్లో పాల్గొన్న లక్ష్మీ**

గుమ్మడి, తంగేడు, గునుగు, బంతి తదితర పూలతో సుందరంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ సందడి చేశారు. పల్లె జానపద గీతాల నుంచి ఆధునిక డీజే పాటల వరకు ఉత్సాహంగా ఆడిపాడారు. కోమటిరెడ్డి లక్ష్మీ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు, మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రతి ఆడపడుచు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రైతులు సుభిక్షంగా ఉండాలని, గ్రామాలు అభివృద్ధి చెందాలని, తెలంగాణ సంస్కృతి తరతరాలకు ఆదర్శంగా నిలవాలని కోరుకున్నారు.





**మహిళలను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే**

వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బతుకమ్మ ఆడుతున్న మహిళల వద్దకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. తమ వద్దకు వచ్చిన ఎమ్మెల్యేను మహిళలు సాదరంగా పలకరిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబాలతో సహా వేడుకలకు వచ్చిన మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు భోజన ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న అనంతరం మహిళలు భోజనాలు చేసి తమ ఇళ్లకు తిరిగి వెళ్లారు.

**సంప్రదాయాల పరిరక్షణకు వేడుకలు**

మునుగోడు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, వారి కుటుంబ సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ ముఖ్య నాయకులు కూడా హాజరయ్యారు. పూల పరిమళాలు, సంప్రదాయ పాటలు, మహిళల సందడి మధ్య మునుగోడులో బతుకమ్మ వేడుకలు పండుగ వాతావరణాన్ని నింపాయి.

## నల్లగొండలో రాజకీయదుమారం

**తెలంగాణ తల్లి విగ్రహానికి ఇందిరమ్మ చీరకట్టిన వైనం**

**మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆగ్రహం**

**పాలాభిషేకం చేసిన బిఆర్ఎస్ శ్రేణులు**

**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్ :** నల్లగొండ జిల్లా కేంద్రం లోని ఎన్ని కళాశాల వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి ఇందిరమ్మ చీర కట్టడంపై నల్లగొండలో రాజకీయ దుమారం రేగింది. గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహానికి చీర కట్టడం పై బిఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి స్పందిస్తూ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బ తీసే విధంగా ఇలాంటి పనులు చేయడం గర్హనీయమని అన్నారు. పోలీసు ఉన్నతాధికారులు వెంటనే కేసు నమోదు చేసి దోషుల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, రాష్ట్ర సంస్కృతి, అమరవీరుల ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. తెలంగాణ

ద్రోహులు,తెలంగాణను వారు వ్యతిరేకించే మాత్రమే ఇలాంటి ఘటనలకు పాల్పడతారని, ఉపేక్షిస్తే భవిష్యత్తులో మరిన్ని ఘటనలు జరుగుతాయని హెచ్చరించారు. ఎన్ టిఆర్ విగ్రహానికి నిప్పు పెట్టిన నిందితులపై ఎలాంటి కేసులు పెట్టారో అలాగే వీరిపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల జోక్యంతో మున్సిపాలిటీ సిబ్బంది విగ్రహానికి కట్టిన ఇందిరమ్మ చీరను తొలగించారు. అనంతరం బి ఆర్ ఎస్ నాయకులు తెలంగాణ





తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలతో అలంకరించి ఆందోళన తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి, జమాల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

# అభిషేక్ ధనాధన్

## 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ
## అదరగొట్టిన అర్ష్‌దీప్
## మూడో టీ20లో విండీస్‌పై భారత్ గెలుపు



ఇండోర్: పరుగులు వెల్లువెత్తుతాయని భావించిన మూడో టీ20లో బంతికి, బ్యాట్‌కు మధ్య ఆసక్తికర పోరు జరిగింది. బౌండరీ విస్తీర్ణం తక్కువగా ఉన్న ఈ మైదానంలో మొదట భారత బ్యాటర్లు చేసింది 223 స్కోరు. ఇది ప్రత్యర్థికి తక్కువ లక్ష్యమే అని అనుకున్నా.. మన బౌలర్లు ఈసారి తమ పదును చూపించారు. కరీబియన్ల హిట్టింగ్‌కు ముకుతాడు వేశారు. దీంతో ఆదివారం జరిగిన ఈ మూడో టీ20లో భారత్ 14 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌లో 2-1 ఆధిక్యం అందుకుంది. అభిషేక్ శర్మ (30 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 69) తుఫాన్ ఇన్నింగ్స్ భారత్ గెలుపులో కీలకంగా నిలిచింది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 37), తిలక్ వర్మ (28) రాణించారు. ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 209 పరుగులు చేసి ఓడింది. హెట్‌మయెర్ (26 బంతుల్లో 43), కమిల్ పూరన్ (42), స్ప్రింగర్ (11 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 35 నాటౌట్), రూథర్‌ఫోర్డ్ (32) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అర్ష్‌దీప్‌నకు 3, నమన్‌కు 2 వికెట్లు దక్కాయి. నాలుగో మ్యాచ్ బుధవారం హైదరాబాద్‌లో జరుగుతుంది.

దెబ్బతీసిన అర్ష్‌దీప్: ఛేదనలో విండీస్‌కు రెండో ఓవర్‌లోనే గట్టి షాక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ హోప్ (5)ను అర్ష్‌దీప్ బౌల్డ్ చేశాడు. అయితే కమిల్, హెట్‌మయెర్ ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరి జోరుకు పవర్‌ప్లేలో జట్టు 54/1 స్కోరుతో నిలిచింది. కానీ ఏడో ఓవర్‌లో హెట్‌మయెర్‌ను నమన్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. పోవెల్ (5) మళ్లీ నిరాశపర్చగా.. 11వ ఓవర్‌లో కమిల్‌ను కూడా నమన్ దెబ్బతీశాడు. ఈ దశలో రూథర్‌ఫోర్డ్.. శాంప్సన్ సహకారంతో ఐదో వికెట్‌కు 46 పరుగులు జోడించాడు. 18వ ఓవర్‌లో పాల్, రూథర్‌ఫోర్డ్‌లను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో విండీస్ ఓటమి ఖరారైంది. చివరి ఓవర్‌లో స్ప్రింగర్ 6,4,6,6తో బాదుడు ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది.

ఆదుకున్న అభిషేక్-ఇషాన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆరంభంలో ఇబ్బందిపడినా.. ఓపెనర్ అభిషేక్, ఇషాన్‌ల ఎదురుదాడితో స్కోరు దూసుకెళ్లింది. రెండో వికెట్‌కు ఈ జోడీ 40 బంతుల్లోనే 108 పరుగులను నమోదు చేసింది. ఆ తర్వాత తిలక్, నితీశ్ (21), అక్షర్ (20) కాసేపు క్రీజులో నిలవడంతో స్కోరు 200 దాటగలిగింది. మరోవైపు ఫామ్‌లోకి వచ్చాడనుకున్న ఓపెనర్ సంజూ శాంసన్ (3)కు షాకిస్తూ అతడిని షమార్ జోసెఫ్ అవుట్ చేశాడు. అయితే మూడో ఓవర్‌లో అభిషేక్ 4,6,6తో గేరు మార్చాడు.

అటు ఇషాన్ సైతం పాల్ ఓవర్‌లో 3 ఫోర్లు రాబట్టడంతో స్కోరు గాడిన పడింది. ఆరో ఓవర్‌లోనూ అభిషేక్ 6,4,4తో చెలరేగి 18 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. మరోవైపు పవర్‌ప్లేలో భారత్ 87/1 రన్స్‌తో నిలిచింది. 8వ ఓవర్‌లోనే జట్టు స్కోరు వందకు చేరిన దశలో స్పిన్నర్ చేజ్ డబుల్ ఝలక్ ఇచ్చాడు. ఒకే ఓవర్‌లో ఇషాన్, శ్రేయాస్ (1)ల వికెట్లు తీశాడు. ఆ వెంటనే అభిషేక్, నమన్ (10) కూడా వరుస ఓవర్లలో పెవిలియన్ చేరారు. ఈ దశలో తిలక్, నితీశ్ జోడీ ఆరో వికెట్‌కు 38 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. అలాగే లోయరార్డర్‌లో ప్రిన్స్ (13 నాటౌట్), అర్ష్‌దీప్ (11) ఫర్వాలేదనిపించగా భారత్ సవాల్ విసిరే స్కోరందుకుంది.

### బౌండరీ వెళ్లిందనుకుని..

జోరు మీదున్న తిలక్ వర్మ అనూహ్య రీతిలో రనౌట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. 17వ ఓవర్‌లో మోటీ వేసిన లో ఫుల్ టాస్‌ను అక్షర్ బలంగా ఆడాడు. సింగిల్ పూర్తి చేశాక వీరిద్దరు రెండో రన్ కోసం ప్రయత్నించారు. కానీ బంతి బౌండరీకి వెళ్లిందని భావించి తిలక్ తన పరుగును మధ్యలోనే ఆపి నెమ్మదిగా నాన్ స్ట్రయికింగ్ ఎండ్ వైపు నడుచుకుంటూ వచ్చాడు. అయితే అప్పటికే ఆ బంతిని అద్భుతంగా ఆపిన కమిల్.. కీపర్ హోప్‌నకు త్రో వేయగా తను బౌలర్ మోటీకి అందించాడు. అప్పటికి నింపాదిగా వస్తున్న తిలక్‌ను మోటీ రనౌట్ చేయడంతో షాక్‌కు గురయ్యాడు. అంతర్జాతీయ టీ20ల్లో తక్కువ బంతుల్లో (1024) 2 వేల పరుగులు సాధించిన బ్యాటర్‌గా అభిషేక్. అలా గే ఒకే క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక సిక్సర్లు (68) బాదిన బ్యాటర్ (శాశ్వత సభ్యదేశాల నుంచి)గా సూర్యకుమార్‌తో సంయుక్తంగా టాప్‌లో నిలిచాడు.



## అంతర్జాతీయ బాలికా దినోత్సవం వేళ..
## స్మృతి మంధానకు ప్రత్యేక గౌరవం

భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్యసమితికి చెందిన యునిసెఫ్ ఇండియా ఆమెను తమ 'సెలబ్రిటీ అడ్వకేట్'గా నియమించింది. ఈ కొత్త బాధ్యతలో భాగంగా బాలికల హక్కులు, భద్రత, వారి సామర్థ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు క్రీడల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించేందుకు స్మృతి కృషి చేస్తుంది. బాలికల ఆరోగ్యం, శ్రేయస్సు, సాధికారత కోసం యునిసెఫ్ ఇండియా చేపట్టే కార్యక్రమాలకు మంధాన మద్దతుగా నిలవనుంది. ఈ నియామకంపై స్మృతి మంధాన హర్షం వ్యక్తం చేసింది. "యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా చేరడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. క్రికెట్ ఆడుతూ పెరిగిన నాకు, ప్రతి కల ఒక అవకాశంతోనే మొదలవుతుందని తెలిసింది. కఠోర శ్రమ, పట్టుదల, ప్రోత్సాహం ఉంటే ఆ అవకాశాన్ని అద్భుతంగా మార్చుకోవచ్చు. ప్రతి చిన్నారి, యువత పెద్ద కలలు కని, వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకునే అవకాశం పొందాలి" అని ఆమె పేర్కొంది. గతంలో కూడా స్మృతి లింగ సమానత్వంపై యునిసెఫ్-ఐసీసీ నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంది. యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రే మాట్లాడుతూ.. స్మృతి నియామకంపై ఆనందం వ్యక్తం చేశారు. "ఒక యువ అథ్లెట్‌గా ప్రయాణం మొదలుపెట్టి, ప్రపంచ స్థాయి క్రికెట్ ఐకాన్‌గా ఎదిగిన స్మృతి ప్రస్థానం.. ప్రతిభకు అవకాశం తోడైతే ఏం సాధించవచ్చో బాలికలకు నిరూపిస్తుంది. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారత్‌లో, బాలికల హక్కులు, నాయకత్వం, శ్రేయస్సుపై పెట్టుబడి పెట్టడమే దేశానికి అత్యంత తెలివైన పెట్టుబడి. ప్రతి బాలిక నేర్చుకోవడానికి, ఆడటానికి, నాయకత్వం వహించడానికి, తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి స్మృతితో కలిసి పనిచేయాలని ఎదురుచూస్తున్నాం" అని వివరించారు. ఇటీవలే హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో స్మృతి మంధాన జట్టు పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. 2025లో తొలిసారిగా ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో ఆమె కీలక సభ్యురాలు. అదే ఏడాది, ఒక క్యాలెండర్ ఇయర్‌లో 1,000 వన్డే పరుగులు చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది. 2026 నాటికి మహిళల అంతర్జాతీయ క్రికెట్, టీ20 ఫార్మాట్లలో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. ప్రస్తుతం మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న స్మృతి, అర్జున అవార్డు గ్రహీత, అలాగే రెండుసార్లు 'ఐసీసీ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును కూడా గెలుచుకుంది.

# భారత్‌తో వన్డే సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు ప్రకటన



భారత్‌తో త్వరలో జరగనున్న 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం న్యూజిలాండ్ క్రికెట్ (ఎన్‌జడ్‌సీ) తమ జట్టును ప్రకటించింది. ఈ సిరీస్‌కు వైట్-బాల్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ నాయకత్వం వహించనున్నాడు. స్టార్ పేసర్ లాకీ ఫెర్గూసన్, ఫిన్ అలెన్, టిమ్ సైఫర్ట్ చాలాకాలం తర్వాత తిరిగి వన్డే జట్టులోకి రావడం విశేషం. గాయం కారణంగా గత టీ20 సిరీస్‌కు దూరమైన యువ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర కోలుకుని, తొలి మూడు మ్యాచ్‌లకు అందుబాటులోకి వచ్చాడు. నవంబర్ 4న ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది జనవరిలో భారత్ గడ్డపై చారిత్రక వన్డే సిరీస్ (2-1) గెలిచిన కివీస్, అదే జోరును సొంతగడ్డపై కొనసాగించాలని భావిస్తోంది. అయితే, ఈ సిరీస్ తర్వాత భారత్‌తోనే టెస్ట్ సిరీస్ ఉన్న నేపథ్యంలో, ఆటగాళ్లపై భారం తగ్గించేందుకు కివీస్ బోర్డు ఓ ప్రయోగాత్మక నిర్ణయం తీసుకుంది. సిరీస్‌లోని తొలి మూడు వన్డేలకు ఒక జట్టును, చివరి రెండు వన్డేలకు మరో జట్టును ఎంపిక చేసింది. తొలి మూడు మ్యాచ్‌ల తర్వాత కొంతమంది ఆటగాళ్లు టెస్ట్ సిరీస్ సన్నాహకాల కోసం వెల్లింగ్‌టన్‌కు వెళ్తారని, వారి స్థానంలో మరో ఏడుగురు ఆటగాళ్లు జట్టుతో చేరతారని హెడ్ కోచ్ రాబ్ వాల్టర్ తెలిపాడు. "భారత్ వంటి బలమైన జట్టుతో ఆడటం మాకు పెద్ద సవాల్. ఏడాది దూరంలో ఉన్న వన్డే ప్రపంచకప్‌కు ఈ సిరీస్ సన్నాహకంగా ఉపయోగపడుతుంది. ఫెర్గూసన్, అలెన్ వంటి మ్యాచ్ విన్నర్లు తిరిగి రావడం జట్టుకు బలం చేకూరుస్తుంది" అని అన్నాడు. గాయాల కారణంగా జాక్ ఫౌల్క్స్, విల్ ఓ'రూర్క్, బెన్ సియర్స్‌లను సెలక్షన్‌కు పరిగణనలోకి తీసుకోలేదని బోర్డు వెల్లడించింది. భారత్‌తో టెస్ట్ సిరీస్‌కు సంబంధించిన జట్టును నవంబర్ ఆరంభంలో ప్రకటించే అవకాశం ఉంది.



## టెస్టుల్లో చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ పేసర్

బంగ్లాదేశ్ యువ ఫాస్ట్ బౌలర్ హసన్ మహమూద్ టెస్ట్ క్రికెట్‌లో చరిత్ర సృష్టించాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టి సంచలనం సృష్టించాడు. ఈ ఘనత సాధించిన తొలి బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్‌గా, దేశం తరఫున మూడో బౌలర్‌గా అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. బంగ్లా జట్టు తరఫున టెస్టుల్లో ఇప్పటివరకు ఇద్దరు స్పిన్నర్లు మాత్రమే హ్యాట్రిక్ సాధించగా, ఓ పేసర్ ఈ ఫీట్ అందుకోవడం ఇదే తొలిసారి. అబుదాబిలోని షేక్ జాయెద్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ మూడో రోజైన ఆదివారం ఈ అద్భుతం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులకు ఆలౌట్ కాగా, బదులుగా బ్యాటింగ్ చేస్తున్న ఆఫ్ఘనిస్థాన్ 220/5 స్కోరుతో నిలిచిన దశలో 26 ఏళ్ల హసన్ మహమూద్ విజృంభించాడు. ఇన్నింగ్స్ 83వ ఓవర్‌లో వరుస బంతుల్లో ముగ్గురు బ్యాటర్లను పెవిలియన్‌కు పంపాడు. తొలుత ఇస్మత్ ఆలమ్‌ను (1) క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాతి బంతికే ఖైస్ అహ్మద్‌ను వికెట్ కీపర్ లిట్టన్ దాస్ అద్భుతమైన క్యాచ్ ద్వారా ఔట్ చేశాడు. ఇక మూడో బంతికి జియా-ఉర్-రెహ్మాన్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి హ్యాట్రిక్ పూర్తి చేశాడు. హసన్ మహమూద్ కంటే ముందు బంగ్లాదేశ్ తరఫున లెగ్ స్పిన్నర్ అలోక్ కపాలి (2003లో పాకిస్థాన్‌పై), ఆఫ్ స్పిన్నర్ సోహగ్ గాజీ (2013లో న్యూజిలాండ్‌పై) మాత్రమే టెస్టుల్లో హ్యాట్రిక్ సాధించారు. ఈ మ్యాచ్‌లో హసన్ మరో ఘనత కూడా అందుకున్నాడు. ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో చివరి వికెట్‌ను పడగొట్టి ఐదు వికెట్ల హాల్‌ను పూర్తి చేశాడు. దీంతో టెస్టుల్లో 50 వికెట్ల మైలురాయిని కూడా చేరుకున్నాడు. బంగ్లాదేశ్ తరఫున అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన పేసర్‌గా నిలిచాడు. హసన్ మహమూద్ దెబ్బకు ఆఫ్ఘనిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 240 పరుగులకే కుప్పకూలింది. దీంతో బంగ్లాదేశ్‌కు 106 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

## అచ్చం నాలాగే ఆలోచిస్తున్నాడు
### వైభవ్ సూర్యవంశీపై సెహ్వాగ్ ప్రశంసలు



టీమిండియా యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేందర్ సెహ్వాగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. తొలి బంతి నుంచే దూకుడుగా ఆడాలనే ఆలోచనా విధానం అచ్చం తనలాగే ఉందని, 15 ఏళ్ల వైభవ్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యుత్తమ ఫామ్‌లో (ప్రైమ్‌లో) ఉన్నాడని సెహ్వాగ్ అభిప్రాయపడ్డారు. శనివారం ఢిల్లీలో జరిగిన పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వార్షిక సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "సూర్యవంశీ ఇప్పుడు ప్రైమ్‌లో ఉన్నాడు. మొదటి బంతి నుంచే బాదాలనే ఆలోచన నాలాగే ఉంది. అతడికి ఎప్పుడు అవకాశం వస్తుంది, భారత్ తరఫున ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడన్నదే ఇప్పుడు ముఖ్యం" అని సెహ్వాగ్ పేర్కొన్నాడు. జట్టు ఎంపికలో వయసు కంటే ప్రదర్శనకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశాడు. "అండర్-19 వంటి విభాగాల్లో వయసు చూడాలి. కానీ ఐపీఎల్ లేదా టీమ్ ఇండియాలోకి వచ్చాక ప్రదర్శనే ప్రధానం. 38 ఏళ్ల విరాట్ కోహ్లీ ఆడుతున్నప్పుడు, 15 ఏళ్ల వైభవ్ కూడా ఆడగలడు" అని సెహ్వాగ్ వివరించారు. ఇప్పటివరకు 8 టీ20 మ్యాచ్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశీ, 186 స్ట్రైక్ రేట్‌తో 246 పరుగులు సాధించాడు. అయితే, భారత జట్టులో ఓపెనింగ్ స్థానాలకు సంజూ శాంసన్, అభిషేక్ శర్మల నుంచి గట్టి పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో యువ ఆటగాళ్లు ఓపికతో ఉండాలని మాజీ ఆల్‌రౌండర్ రాబిన్ సింగ్ సూచించారు. ఇదే కార్యక్రమంలో సెహ్వాగ్ మాట్లాడుతూ.. వన్డేల్లో రెండో డబుల్ సెంచరీ సాధించిన శుభమన్ గిల్‌ను అభినందించాడు. అలాగే, 2027 వన్డే ప్రపంచకప్‌లో జస్‌ప్రీత్ బుమ్రా వంటి పదునైన బౌలింగ్ దళం ఉంటే భారత్ కప్ గెలవడం సులభమని జోస్యం చెప్పారు.

## ఆ 'నలుగురు కలిసి' 600 వికెట్లు..
## ఆసీస్ బౌలర్ల సరికొత్త చరిత్ర!



ఆస్ట్రేలియా ప్రఖ్యాత బౌలింగ్ చతుష్టయం టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. పేసర్లు పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, స్పిన్నర్ నాథన్ లైయన్‌లతో కూడిన ఈ బృందం.. కలిసి ఆడిన టెస్టుల్లో 600 వికెట్లు పడగొట్టిన తొలి బౌలింగ్ బృందంగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. దక్షిణాఫ్రికాతో దర్బన్‌లోని కింగ్స్‌మీడ్ మైదానంలో జరుగుతున్న తొలి టెస్టులో ఈ అరుదైన ఘనతను అందుకుంది. ఈ టెస్టు ప్రారంభానికి ముందు ఈ నలుగురు బౌలర్లు కలిసి 37 టెస్టుల్లో 599 వికెట్లు తీశారు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో వికెట్లు పడగొట్టడం ద్వారా తమ 38వ టెస్టులో 600 వికెట్ల మైలురాయిని దాటారు. ఈ 38 మ్యాచుల్లో కమ్మిన్స్ అత్యధికంగా 160 వికెట్లు పడగొట్టగా, స్టార్క్ 155, హాజిల్‌వుడ్ 152, లైయన్ 140 వికెట్లతో తమ వంతు పాత్ర పోషించారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే బృందంగా ఆడుతూ 600 వికెట్ల మైలురాయిని దాటిన తొలి బౌలింగ్ చతుష్టయం ఇదే కావడం విశేషం. వీరి తర్వాత రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్‌కు చెందిన జేమ్స్ అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్, బెన్ స్టోక్స్, మొయిన్ అలీల చతుష్టయం 34 టెస్టుల్లో కలిసి 433 వికెట్లు మాత్రమే తీసింది. దీన్నిబట్టి ఆసీస్ బౌలర్ల ఆధిపత్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత మ్యాచ్ విషయానికొస్తే, తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు మాట్ రెన్షా సెంచరీతో 390 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను ఈ నలుగురు బౌలర్లు కట్టడి చేశారు. కమ్మిన్స్ మూడు వికెట్లు తీయగా, హేజిల్‌వుడ్, లైయన్ చెరో రెండు వికెట్లు, స్టార్క్ ఒక వికెట్ పడగొట్టారు. దీంతో దక్షిణాఫ్రికా 197 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.



## గుబులు పుట్టిస్తున్న దక్ష బాస్ లేడీ వైబ్స్

తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న యువ కథానాయిక దక్షా నగర్కార్ మరోసారి సోషల్ మీడియా వేదికగా వార్తల్లో నిలిచింది. హుషారు, జాంబీ రెడ్డి తెలుగు పరిశ్రమలో తనకు మంచి గుర్తింపునిచ్చిన సినిమాలు. వీటితో పాటు నిరంతర ఫోటోషూట్లు, అవార్డ్ ఈవెంట్లతోను యూత్ లోకి దూసుకెళ్లింది ఈ ఉత్తరాది భామ. ఈ బ్యూటీ నిత్యం డిఫరెంట్ ఫోటోషూట్లతో అభిమానులను అలరిస్తోంది. తాజాగా దక్ష ఇన్ స్టా ఖాతాలో పంచుకున్న కొత్త ఫోటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో దక్షా నగర్కార్ తనదైన శైలిలో క్లాసీ అండ్ గ్లామరస్ లుక్‌తో కనిపించి నెటిజన్లను కట్టిపడేసింది. ఆధునిక ఫ్యాషన్ దుస్తుల్లో బోల్డ్ అండ్ ఎలిగెంట్ పోజులతో ఆకట్టుకుంటూ.. గ్లామర్‌తో పాటు కాన్ఫిడెన్స్ కలబోసిన తన మేకోవర్‌ను ప్రదర్శించింది. ఆ స్టైలింగ్, ఆటిట్యూడ్ చూసిన అభిమానులు ఫిదా అవుతూ ఈ ఫోటోలపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఫోటోలు షేర్ చేసిన కొద్ది సమయంలోనే కామెంట్ సెక్షన్ అభిమానుల స్పందనలతో నిండిపోయింది. వేల సంఖ్యలో లైకులు, హార్ట్ అండ్ ఫైర్ ఎమోజీలతో నెటిజన్లు తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. --దివి నుంచి దిగివచ్చిన దేవకన్యలా ఉంది--, --ఎలిగెన్స్ విత్ ఆటిట్యూడ్-- అంటూ నెటిజన్లు కామెంట్ల రూపంలో దక్షా అందాన్ని ఆకాశానికెత్తేస్తున్నారు.

## సన్‌షైన్- హరికేన్ కలిస్తే రకుల్ ప్రీత్.. ప్రగ్య షాకింగ్ పోస్ట్!



భారతీయ సినీ పరిశ్రమలో టాలీవుడ్, బాలీవుడ్ బ్యూటీలు రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైస్వాల్ మధ్య ఉన్న మంచి అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చిత్ర పరిశ్రమలో విభిన్న ప్రాజెక్టులతో బిజీగా ఉంటూనే, వీరిద్దరూ ప్రాణ స్నేహితులుగా కొనసాగుతున్నారు. తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ పుట్టినరోజు సందర్భంగా ప్రగ్యా జైస్వాల్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఒక ప్రత్యేకమైన శుభాకాంక్షల పోస్ట్ ప్రస్తుతం నెట్టింట తీవ్రంగా వైరల్ అవుతోంది. ఈ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ప్రగ్యా జైస్వాల్ తన స్నేహితురాలు రకుల్‌పై ఉన్న ప్రేమను హృదయపూర్వకంగా రాసుకొచ్చారు. రకుల్‌ను --సన్‌షైన్- హరికేన్ కలిసిన అద్భుతమైన వ్యక్తి- అని సంబోధిస్తూ ఎంతో ఇష్టంగా బర్త్‌డే విషెస్ తెలిపారు. తనలాంటి ఇంట్రోవర్ట్‌ను ప్రేమతో తన జీవితంలోకి ఆహ్వానించి.. లోకాన్ని మరింత సంతోషంగా అనుభవించేలా చేసినందుకు రకుల్‌కు ప్రగ్యా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రగ్యా పోస్ట్ చేసిన కొద్దిసేపటికే రకుల్ ప్రీత్ సింగ్ కూడా ఎంతో ప్రేమగా దీనిపై స్పందించారు. కామెంట్ సెక్షన్‌లో -లవ్ యూ సో మచ్ బేబీ గర్ల్- అని స్పందిస్తూ తన అనురాగాన్ని అంతే ప్రేమగా రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారు. ఈ ఇద్దరు భామల మధ్య ఉన్న ఆత్మీయమైన సంభాషణ చూసి అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో మురిసిపోతున్నారు. సోషల్ మీడియాలో ఈ పోస్ట్ దర్శనమివ్వగానే అభిమానులు, ఇతర సినీ సెలబ్రిటీలు రకుల్‌కు పెద్ద ఎత్తున పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. కామెంట్ సెక్షన్‌లో హార్ట్ ఎమోజీలతో తమ అభిమానాన్ని చాటుకోవడమే కాకుండా.. వీరిద్దరి గ్లామరస్ లుక్స్ - స్నేహబంధాన్ని ప్రశంసిస్తూ వందలాది మంది ఆసక్తికరమైన సందేశాలు పోస్ట్ చేస్తున్నారు.

## విజువల్స్ మాత్రమే కాదు.. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తోనూ

టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న జంటగా నటించిన భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' మరో నాలుగు రోజుల్లో థియేటర్లలోకి రాబోతోంది. విజువల్స్, యాక్షన్ సీన్ల గురించి సోషల్ మీడియాలో భారీగా చర్చ జరుగుతుండగా, మరోవైపు ఈ సినిమాకు అసలైన బలం అజయ్-అతుల్ అందించిన సంగీతమేనని ఇండస్ట్రీ టాక్. ఇప్పటికే విడుదలైన 'ఎందయ్యా సామి' పాట చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. అయితే ఈ సినిమా అసలైన విజయాన్ని డిసైడ్ చేసే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మ్యాజిక్ ఎలా ఉండబోతోందో ఇప్పుడు చూద్దాం.. బాలీవుడ్ ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్‌కు పీరియాడిక్ మరియు డివైన్ కంటెంట్‌ను తమ మ్యూజిక్‌తో ఎలివేట్ చేయడంలో ప్రత్యేకమైన ట్రాక్ రికార్డ్ ఉంది. 'ఆదిపురుష్' లాంటి సినిమాలు కంటెంట్ పరంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, వారు అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను ఎమోషనల్‌గా కనెక్ట్ చేశాయి. ఇక ఆ సినిమాలో మ్యూజిక్ మాత్రమే ప్రేక్షకులను థియేటర్లలో కట్టిపడేసిందనే ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు 'రణబాలి' విషయంలోనూ అలాంటి మ్యాజిక్ రిపీట్ అవుతుందనే అంచనాలు ఉన్నాయి. పీరియాడిక్ సినిమాలకు కేవలం గ్రాఫిక్స్, భారీ సెట్లు మాత్రమే సరిపోవు. ఆ నాటి కాలాన్ని, డ్రామాను ఆడియన్స్‌కు అనుభూతి చెందేలా చేయడంలో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇక 19వ శతాబ్దపు బ్రిటీష్ కాలం నాటి పోరాటాలను, రాయలసీమ గ్రామీణ నేపథ్యాన్ని ప్రతిబింబించేలా అజయ్-అతుల్ లైవ్ ఆర్కెస్ట్రా మరియు జానపద ధ్వనులను ఉపయోగించారు.



## రియా చక్రవర్తికి సినిమాల్లో ఛాన్సుల్లేకపోయినా కానీ..!

తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమలలో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న రియా చక్రవర్తి, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆకస్మిక మరణం తర్వాత దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యారు. ఆ సమయంలో ఆమె ఎదుర్కొన్న ఇబ్బందులు, విమర్శలు, క్యారెక్టర్ అసాసినేషన్ వంటి పరిణామాలు జీవితాన్ని పూర్తిగా మార్చివేశాయి. అన్ని వివాదాలు, కేసుల నుంచి ఆమె చట్టపరంగా నిర్దోషిగా బయటపడినా సినీ పరిశ్రమలోని ప్రముఖులు- నిర్మాతలు ఇప్పటికీ ఆమెను దూరం పెట్టడం గమనార్హం. తెలుగు సినీపరిశ్రమలో ప్రముఖ హీరో రియా చక్రవర్తికి అవకాశాలు కల్పిస్తానని మాటిచ్చినా ఇప్పటికీ ఆ ప్రాజెక్ట్ గురించి ఎలాంటి సమాచారం రాలేదు. అయినప్పటికీ ఎలాంటి నిరాశకు లోనుకాకుండా.. రియా మొక్కవోని ధీక్షతో తన ప్రయాణాన్ని తిరిగి కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నా సోషల్ మీడియా వేదికగా మోడలింగ్ రంగంలో రాణిస్తూ రియా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. డిజిటల్ మార్కెటింగ్ - సోషల్ మీడియా ద్వారా రియా చక్రవర్తి నిలకడగా మంచి ఆదాయాన్ని ఆర్జిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇటీవల కాలంలో ప్రముఖ రియాలిటీ టీవీ షోలలో పాల్గొంటూ రియా తన సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా ప్రారంభించారు. ఓటీటీ- టెలివిజన్ కార్యక్రమాల ద్వారా ఆమె భారీ మొత్తంలో పారితోషికం అందుకుంటూ, తనకంటూ కొత్త ఉపాధి మార్గాలను ఏర్పరచుకుంటున్నారు.ప్రముఖ బ్రాండ్ -స్టేజ్ బ్యూటీ- భాగస్వామ్యంతో.. అలాగే తన సొంత క్రీమ్ -బ్లష్ క్యాచ్ బ్లషిన్- లాంచ్ చేయడం ద్వారా ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారారు. బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు, ఇన్‌స్టాగ్రామ్ యాడ్స్- టీవీ షోల ద్వారా నెలకు, సంవత్సరానికి భారీ మొత్తంలో ఆర్జిస్తూ వ్యాపార రంగంలోనూ దూసుకెళ్తున్నారు.



Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA